ANN తెలుగు

Follow: @ANNTELUGU

19-09-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 285 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## టాప్ న్యూస్



### చింతమడకలో ఎంగిలి పూలు

- లండన్‌లో సద్దులు
- హరీష్‌కు షాకిస్తూ కవిత బతుకమ్మ షెడ్యూల్
- 21 నుండి షురూ


02



### ఆత్మగౌరవం పోయాక పదవులు ఎందుకు

- ఈటల సంచలన కామెంట్స్


02



### కల్కి నుండి దీపిక ఔట్

- దీపిక డిమాండ్లకు షాకై
- చేతులెత్తేసిన వైజయంతీ మూవీస్

08



# అధ్యక్షా..

## ఏపీ అసెంబ్లీ షురూ


### తొలిరోజు జీఎస్టీ సంస్కరణలపై చంద్రబాబు ప్రజంటేషన్

### జీరో అవర్ పై రచ్చ.. స్పీకర్ అసహనం

**అమరావతి, మహా:** ఏపీ అసెంబ్లీ ప్రారంభమైంది. విపక్ష నేత జగన్ ఎప్పటిలాగే సభకు దుమ్మా కొట్టగా, కౌన్సిల్ హాట్ హాట్ గా మొదలైంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు తొలిసారి కౌన్సిల్ లోకి అడుగుపెట్టారు. ఇక ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 27 వరకు జరగనున్నాయి. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు 10 రోజుల పాటు నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో తొలుత నిర్ణయించారు. కానీ, ఆ తర్వాత 8 రోజులకు కుదించారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ జరగనుంది. సభలో చర్చించేందుకు 18 అంశాలను టీడీపీ, 9 అంశాలను బీజేపీ ప్రతిపాదించింది. ప్రశ్నోత్తరాలతో పాటు జీరో అవర్ లోనూ మంత్రులు ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అంతకుముందు జీరో అవర్ పై స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసహనం వ్యక్తం చేయడంతో విషయం సీఎం చెవిని చేరింది. దీంతో మంత్రులకు సీరియస్ గా ఆదేశాలిచ్చారు.




# జూబ్లిహిల్స్‌పై సీఎం ఫోకస్



## మెజారిటీ తేకుంటే..

### కార్పోరేషన్ ఛైర్మన్లకు రెన్యువల్ కట్

### ప్రతీరోజూ పరిస్థితి సమీక్షిస్తున్న రేవంత్

### 18 మంది కార్పోరేషన్ ఛైర్మన్ల పనితీరుపై రిపోర్ట్

**హైదరాబాద్, మహా:** జూబ్లిహిల్స్ బైపోల్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోకస్ పెంచారు. ఇకపై ప్రతీరోజూ కీలకమని, ఈ ఉప ఎన్నికకు సంబంధించిన అన్ని వ్యవహారాలను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ప్రకటించిన సీఎం అందుకు తగ్గట్లుగా రోజువారీ నివేదికలు ఇంటెలిజెన్స్ వర్గాలతో పాటు ప్రైవేట్ ఏజెన్సీల నుండి కూడా తెప్పించుకుంటున్నట్లు తెలిసింది. ముగ్గురు మంత్రులు, 18 మంది కార్పోరేషన్ ఛైర్మన్లకు బాధ్యతలు అప్పగించగా.. పలువురు కార్పోరేషన్ ఛైర్మన్ల తీరుపై సీఎం తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. చాలా మంది కార్పోరేషన్ ఛైర్మన్ లు తమకు అప్పగించిన బాధ్యతలు నెరవేర్చకపోగా, ఇపుడు పార్టీ బాధ్యతల నిర్వహణలోనూ తూతూమంత్రంగా వ్యవహరిస్తుండడంపై పార్టీ పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఒక్కో డివిజన్ కు ఇద్దరు చొప్పున పార్టీ ప్రచార బాధ్యతలను తీసుకున్నారు.

మిగతా 2లో



# హైదరాబాద్‌లో కుంభవృష్టి

## రహదారులు జలమయం..

### భారీగా ట్రాఫిక్ జామ్‌లు.. మహానగరం గజగజ

**హైదరాబాద్, మహా:** మహానగరం హైదరాబాద్ వరుణుడి దెబ్బకు గజగజలాడుతోంది. ఇప్పటికే కురిసిన వర్షం నుంచి లోతట్టు ప్రాంత వాసులు ఇంకా తేరుకోకముందే మరోసారి గురువారం కుంభవృష్టి కురిసింది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు బిక్కు బిక్కుమంటున్న నగరవాసులపై ఈ వాన మరింత ఇబ్బందిపెడుతోంది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షాలతో రోడ్లపై ఎక్కడికక్కడ వరదనీరు చేరి నగర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆఫీసుల నుంచి ఇంటికి వచ్చే ఉద్యోగాలు నానా అవస్థలు పడ్డారు. గురువారం కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది.

**అతలాకుతలం**

ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి భాగ్యనగరంలోని పలు ప్రాంతాలు ముంపు బారినపడుతున్నాయి. చినుకుపడితేనే నగరవాసి వెన్నులో వణుకుపుడుతోంది.

మిగతా 2లో




### సాఫ్ట్‌వేర్‌ను వాడి.. ఓటర్ ఐడీలను తొలగిస్తున్నారు

#### రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

**మహా :** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు

మిగతా 2లో



### రాష్ట్రంలో యూకే ప్రభుత్వం పెట్టుబడులు!

- బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకారం
- జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులు పెట్టలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- అందుకు బ్రిటిష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలోనూ బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి

వివరాలు 2లో



### తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ

- ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- బతుకమ్మతో రికార్డులు.. అందరూ భాగస్వాములు కావాలి మంత్రి జూపల్లి

02

# కేటీఆర్.. నువ్వొక బచ్చగాడివి

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫైర్

- నా గెలుపును ఆపడానికి మీ నాయన వల్లే కాలేదు.. నీ వల్ల అవుద్దా?
- వచ్చే ఎన్నికల వరకు ఇండియాలో ఉంటారా .. సంచి సర్దుకుని విదేశాలకు చెక్కుతవా?
- తల కిందులగా తపస్సు చేసినా మీకు లోక్‌సభ ఎన్నికల సీట్లే వస్తాయ్.. జీరో
- దమ్ముంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించాలని కేటీఆర్‌కు ఛాలెంజ్



**పాలేరు, మహా:** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యల పై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'పాలేరులో నా గెలుపును ఆపడానికి మీ నాయన మూడు సార్లు ముక్కు నేలకు రాసిన.. ఆపలేకపోయాడు. నియోజకవర్గానికి వచ్చి ఏం చేయలేకపోయాడు. ఆయన వల్లే కాలేదు.. నీ వల్ల అవుద్దా.. నువ్వు ఒక బచ్చాగాడివి' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్‌పై విరుచుకపడ్డారు. నేటి పేదోడి ప్రభుత్వం సంక్షేమ పథకాలు తెస్తుంటే..కొంతమంది విషం

మిగతా 2లో






### ప్రజా సమస్యలపై నిలదీయండి

- శాసన మండలిలో వైసీపీకి మంచి బలం ఉంది
- విద్య, వైద్యం, వ్యవసాయాన్ని పట్టించుకోవడం లేదు
- వైఎస్సార్ ఎల్పీ భేటీలో జగన్ కీలక వ్యాఖ్యలు

02

### కాంగ్రెస్ శ్రేయస్సు కోసమే.. నా అభిప్రాయం బహిరంగంగా చెప్పా

- రూమర్స్ నమ్మొద్దు.. గుంటూరు వ్యక్తిగత కార్యక్రమం
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- 70 వాహనాల కాన్వాయ్ తో ఏపీకి రాజగోపాల్ రెడ్డి

02

### భారత్, మోదీతో మంచి స్నేహం

ట్రేడ్ డీల్‌తోనే పాక్‌తో యుద్ధాన్ని ఆపా: ట్రంప్

07




### యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్

#### ఏఐ టెక్నాలజీకి హైదరాబాద్ గ్లోబల్ సెంటర్

డిజైన్ సామాజిక మార్పునకు ఆయుధం కావాలి

యూఎక్స్ ఇండియా 25 అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి


02



## ఆత్మగౌరవం పోయాక పదవులు ఎందుకు

.. ఈటల సంచలన కామెంట్స్

**మహా, మల్కాజ్ గిరి:** బీజేపీ కీలక నేత, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆత్మగౌరవం కోల్పోయాక ఏ పదవి వచ్చినా గడ్డిపోచతో సమానమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పదవులను గడ్డిపోచల్లాగా విసిరేశామని గుర్తు చేశారు ఈటల. సాధారణంగా 20 ఏళ్లలో 4 సార్లు ఎమ్మెల్యే అవుతారన్నారు. కానీ తాను 7 సార్లు ఎమ్మెల్యే అయ్యానన్నారు. ఆత్మగౌరవం కోసం రాజీనామాల మీద రాజీనామాలు చేశామన్నారు. హైదరాబాద్ ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం కాప్రాలో గురువారం జరిగిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వతంత్రం ఎంతోమంది త్యాగఫలం అని మర్చిపోవద్దని అన్నారు. పిల్లలకు దేశభక్తి నేర్పించాలని పేరెంట్స్ కు సూచించారు. దేశభక్తి, కమిట్మెంట్ లేకుంటే కష్టం అవుతుందన్నారు. పక్క దేశాల్లో ఏం జరుగుతుందో ఇప్పుడు చూస్తున్నామన్నారు. కన్న తల్లిదండ్రులను పిల్లలు చంపుతున్నారని.. కొందరు భర్తలను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నుండి కాపాడేది మన విలువలేనని అన్నారు. ఇవన్నీ ఎక్కడో జరుగుతున్నాయని పట్టించుకోకుండా ఉండొదన్నారు. అవి మన గడపలను కూడా తాకుతాయన్నారు. అందుకే పిల్లలను జాగ్రత్తగా పెంచాలని సూచించారు.



## హైదరాబాద్‌లో కుంభవృష్టి

(మొదటిపేజీ తరువాయి)

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, శ్రీనగర్‌కాలనీ, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, ఫలక్‌నుమా, బార్కస్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో వరదనీరు రోడ్లపై చేరి చెరువులను తలపిస్తున్నాయి. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. పంజాగుట్ట మోడల్ హౌస్ ముందు రహదారి చెరువులా మారిపోయింది. మోకాలి లోతు నీరు రావడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ లోని అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ లు నెలకొనగా, వర్షాల కారణంగా రహదారులు కూడా అస్తవ్యస్తంగా మారుతున్నాయి.

## సాఫ్ట్‌వేర్‌ను వాడి.. ఓటర్ ఐడీలను తొలగిస్తున్నారు

రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు




(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. "ఈ ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక ప్రక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించాం. నేను ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియను ఇష్టపడతాను. ఈ ప్రక్రియను నేను రక్షిస్తున్నాను. ఇక దీనికి ఎలా స్పందించాలనేది మీ చేతుల్లోనే ఉంటుంది. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగింది" అని విమర్శించారు.

# యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్

**హైదరాబాద్, మహా :** యాప్ డిజైన్ లీడర్ గా హైదరాబాద్ ను నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. యూఎంఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హైటెక్ సిటీలోని హోటల్లో యూఎక్స్ ఇండియా 25 పేరిట ఏర్పాటు చేసిన 21వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్పీరియన్స్ అండ్ ప్రోడక్ట్ డిజైన్ ను ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం ఎటువంటి టెక్నాలజీ నైనా అందిపుచ్చుకొని లీడర్ గా ఎదుగుతుందన్నారు. ఏఐ టెక్నాలజీకి హైదరాబాద్ మహానగరాన్ని గ్లోబల్ సెంటర్ గా నిలబెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ పట్టుదలతో ఉందన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన ప్రతినిధులు హైదరాబాద్ వాతావరణం, సంస్కృతి, కళలు, ఆహారం అన్నిటిని ఆస్వాదించాలని, ఈ రాష్ట్రంలో ప్రధానంగా టెక్నాలజీ రంగంలో గుర్తించిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు. డిజైన్ అనేది కేవలం అందానికి కాదు అది సామాజిక మార్పునకు ఆయుధం కావాలని ఉద్బోధించారు. తెలంగాణ ప్రభుత్వం సమానత్వం, అభివృద్ధిని ప్రోత్సహిస్తుందన్నారు. హైదరాబాదును ప్రపంచ డిజైన్ క్యాపిటల్ గా మార్చడానికి కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ అంతర్జాతీయ సదస్సు హైదరాబాద్



చరిత్రలో ఒక మలుపు రాయి అని, తెలంగాణ రాష్ట్ర డిజిటల్ భవిష్యత్తును పరిపుష్టం చేయడంలో, మరో అడుగు ముందుకు వేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్లు మన జీవితాల్లో అనివార్యమైనవి, కానీ ఒక యాప్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటేనే అది విజయవంతం అవుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ ఇంక్లూజన్ ను ప్రోత్సహిస్తుంది, టీఎస్ ఐపాస్ వంటి పాలసీల ద్వారా స్టార్టప్ లకు చేయూతనిస్తుందని తెలిపారు. భారతదేశంలో యూపీఐ వంటి యాప్ లు సరళంగా రూపొందించడంతో పెద్ద విజయం సాధించాయన్నారు. ప్రాంతీయ భాషల్లోనూ యాప్ లు రూపొందించడం మూలంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా సులభంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు.

**త్వరలో "సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ డిజైన్ : మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్ ను గ్లోబల్ డిజైన్ హబ్ గా మార్చాలనే సంకల్పంతో త్వరలోనే "సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ డిజైన్"ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ లాంటి సంస్థల ద్వారా తెలంగాణను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న "ఏఐ ఇన్నోవేషన్ హబ్" లో డిజైనింగ్ కు పెద్దపీట వేస్తున్నామన్నారు. డిజైనింగ్ అంటేనే సృజనాత్మకత అని, కాకపోతే ఆది యూజర్ ఫ్రెండ్లీ గా ఉండాలన్నారు. అప్పుడే ఆ యాప్ లేదా వెబ్ సైట్ మనుగడ సాధ్యమన్నారు. ఈ ప్రక్రియలో ఏఐ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ వల్ల ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా చూడాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే అంకుర సంస్థలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు.



## రాష్ట్రంలో యూకే ప్రభుత్వం పెట్టుబడులు!

బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- చెవెనింగ్ స్కాలర్ షిప్‌ను తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకరం
- జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులు పెట్టలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- అందుకు బ్రిటిష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలోనూ బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, మహా:** యూకే ప్రభుత్వం అందించే చెవెనింగ్ అంతర్జాతీయ స్కాలర్‌షిప్ విషయంలో కోఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించాలన్న సీఎం రేవంత్ విజ్ఞప్తికి బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ ఆంగీకరించారు. భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. వారితో పాటు డిప్యూటీ హైకమిషనర్ (హైదరాబాద్) గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళిని రఘురామన్ కూడా ఉన్నారు. యూకే ప్రభుత్వం అంతర్జాతీయ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా అందిస్తున్న చెవెనింగ్ స్కాలర్‌షిప్‌లను కోఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణకు చెందిన మెరిట్ విద్యార్థులకు అందించడానికి ఈ సందర్భంగా అంగీకరించారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి గారికి వివరించారు.

**మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

యూకేలోని యూనివర్సిటీల్లో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం అక్కడి వర్సిటీలు అడ్మిషన్లు, ఇతరత్రా కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో కొత్తగా తీసుకురానున్న ఎడ్యుకేషన్ పాలసీ ముసాయిదా గురించి ముఖ్యమంత్రి బ్రిటిష్ హైకమిషనర్‌కు వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ అందించడానికి లిండీ కామెరాన్ సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని, ప్రధానంగా జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్ సెంటర్లు, వివిధ అకాడమీలకు సంబంధిత రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తి పట్ల బ్రిటిషన్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ

**ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలి : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**బతుకమ్మతో రికార్డులు.. అందరూ భాగస్వాములు కావాలి- మంత్రి జూపల్లి**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గాంధీ భవన్ లో మంత్రి జూపల్లి క్రిష్ణారావుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన.. కొందరు బతుకమ్మ పండుగను రాజకీయం చేశారని టీపీసీసీ చీఫ్ తెలిపారు. వివిధ రకాల పాటలతో బతుకమ్మను రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. మొదటిరోజు చేసుకునే ఎంగిలి పువ్వు బతుకమ్మ దగ్గరి నుంచి చివరి సద్దుల బతుకమ్మ వరకూ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని కాంగ్రెస్ శ్రేణులు ముందుకెళ్లాలని సూచించారు. బతుకమ్మ పండుగపై కొన్ని అపోహలు ఉన్నాయని మహేష్ గౌడ్ అన్నారు. బతుకమ్మ తెలంగాణ పండుగ.. తెలంగాణ సంప్రదాయమని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో బతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్లీ వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మను అద్భుతంగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## చింతమడకలో ఎంగిలి పూలు లండన్‌లో సద్దులు

హరీష్ కు షాకిస్తూ కవిత బతుకమ్మ షెడ్యూల్ 21 నుండి షురూ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బతుకమ్మ వేడుకలను తనదైన శైలిలో నిర్వహిస్తూ కల్వకుంట్ల కవిత ప్రత్యేకత చాటారు. బతుకమ్మను తెలంగాణ ఉద్యమంలో భాగం చేయడంలో కవిత కీలకపాత్ర పోషించారు. బతుకమ్మపై అనేక పాటలు రాయించారు. పుస్తకాలు ముద్రించారు. ఉద్యమ సమయంలో కవిత బతుకమ్మతో ఉద్యమాన్ని అనుబంధం చేశారు. ఇపుడు బీఆర్ఎస్ కు కవిత దూరమైన నేపథ్యంలో కవిత బతుకమ్మ వేడుకలపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో కవిత తన బతుకమ్మ షెడ్యూల్ ను విడుదల చేశారు. ఈ నెల 21న కేసీఆర్ స్వగ్రామం సిద్దిపేట నియోజకవర్గం చింతమడకలో నిర్వహించనున్న ఎంగిలి పూల బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. హరీష్ రావుపై తీవ్ర ఆరోపణలు చేసిన కవిత.. తొలిసారి సిద్దిపేట నియోజకవర్గం నుండే స్వతంత్రబాట పడుతుండడం ఆసక్తిగా మారింది.

**కవిత బతుకమ్మ షెడ్యూల్..**

- 21న ఎంగిలిపూల బతుకమ్మ చింతమడక (సిద్దిపేట జిల్లా)
- 22న తెలంగాణ జాగృతి కార్యాలయం హైదరాబాద్
- 23న శ్రీరాంపూర్ (మంచిర్యాల జిల్లా)
- 24న సిద్దిపేట జిల్లాలోని వర్గల్ అమ్మవారి దర్శనం
- 25న హర్యానా లో మాజీ ఉప ప్రధాని దేవిలాల్
- 112వ జయంతి ఉత్సవాలకు హాజరు
- 26న ఖాతార్
- 27న మాల్టా
- 28న లండన్

## కేటీఆర్.. నువ్వొక బచ్చగాడివి

(మొదటిపేజీ తరువాయి)

కక్కుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పాముకు కోరల్లో విషం ఉంటే, కొందరి నాయకులకు ఒళ్ళంతా విషం ఉంటుందని విమర్శించారు. ఎదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్డులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేదిక మీద నుంచి నాటి ప్రబుద్ధులను అడుగుతున్న.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని ఆయన ప్రశ్నించారు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు ఈ పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు. బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు రెండు పర్యాయాలు బుద్ధి చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. వారి సోదరి, బిడ్డ సమస్యను సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

**కేటీఆర్ మీద బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తాం..**

మూడున్నర సంవత్సరాల తర్వాత జరిగే ఎన్నికల గురించి ట్విట్టర్ టిల్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 'మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు. దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, విజన్ గురించి నేను మాట్లాడను.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచి చూపించు' అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. వచ్చే



అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ మీద బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తామని మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. మూడున్నర సంవత్సరాల తర్వాత కేటీఆర్ ఇండియాలో ఉంటారో.. బ్యాగ్ సర్దుకుని విదేశాలకు వెళ్తారో చూడాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు కేటీఆర్ అంటూ.. విమర్శించారు. మీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బి ఫామ్ తీసుకోలేదని పేర్కొన్నారు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసిన ఏమి చేయలేక పోయారని, నువ్వెంత బచ్చాగాడివి అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదన్నారు. ఇచ్చిన మాట కోసం నిలబడి, నెరవేర్చే పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరని ఉద్ఘాటించారు. తల కిందులగా తపస్సు చేసిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అవే సీట్లు వస్తాయని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు.

## జూబ్లిహిల్స్‌పై సీఎం ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థి ఎవరనేది ప్రధానం కాదని, పార్టీ గెలుపుపైనే దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో సూచించారు. మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే గత ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గంలో భారీ మెజారిటీ సాధించగా, ఇపుడు ఆ స్థాయి పట్టు నిలుపుకోవాలని పట్టుదలగా ఉంది. డివిజన్ల వారీగా బాధ్యులను నియమించడంతో పాటు సీఎం ప్రతీరోజూ పరిస్థితులు తెలుసుకుంటున్నారు.



**అనుకూలంగా గ్రౌండ్**

జూబ్లిహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ కు అనుకూలంగా ఉందని, ఈ నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న మైనారిటీలు, కమ్మ సామాజికవర్గంతో పాటు ఎస్సీలు, బీసీలు ఎక్కువ శాతం కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్నారని నివేదికలు అందాయి. కనీసం 20వేల మెజారిటీతో జూబ్లిహిల్స్ గెలవాలని కాంగ్రెస్ టార్గెట్ గా పెట్టుకుని పనిచేస్తోంది. జూబ్లిహిల్స్ బైపోల్ పై ఏ మాత్రం అలక్ష్యం చేయకుండా, ఖచ్చితంగా గెలవాలని.. మంచి మెజారిటీతో స్థానిక ఎన్నికలకు వెళ్ళాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. మంత్రి వివేక్ తోపాటు హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు తమకు అప్పగించిన బాధ్యతలను పర్యవేక్షిస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలిస్తున్నారు. ఓవైపు బీఆర్ఎస్ ప్రచారాన్ని తట్టుకుంటూ తగిన వ్యూహాలతో ముందుకెళ్ళాలని, బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును కైవసం చేసుకుంటే రాజకీయంగా మంచి మైలేజ్ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. గెలిచే అవకాశమున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వల్ప తేడాతో ఓడిపోవడం కాంగ్రెస్ ఊహించని పరిణామం. ఇపుడు ఏ మాత్రం అజాగ్రత్తకు తావులేకుండా మంచి విజయం సాధించాలని, ఏ సమస్యలున్నా తాను పరిష్కరిస్తానని నిర్దేశించారు.

**బీసీకే సీటు**

జూబ్లిహిల్స్ అసెంబ్లీ అభ్యర్థిగా బీసీని నిలిపడం ఖాయమైంది. స్థానిక నేత నవీన్ యాదవ్ ఈ రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. బొంతు రామ్మోహన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా ఖరారుచేయడంతో మైనారిటీలు మద్దతుగా నిలుస్తారని భావిస్తున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అనూహ్యంగా అనిల్ కుమార్ యాదవ్ పేరు కూడా తెరపైకి వస్తోంది. నెలాఖరులో నోటిఫికేషన్ రానుండగా, నోటిఫికేషన్ వచ్చాకే అభ్యర్థిని అధికారికంగా ప్రకటించే అవకాశముంది,

## శిర్డీ సాయిబాబా సంస్థాన్ పేరుతో నకిలీ వెబ్‌సైట్

మోసపోయిన భక్తులు

**శిర్డీ, మహా:** శిర్డీ అనేది ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తుల ఆధ్యాత్మిక కేంద్రం. రోజూ వేలాది మంది భక్తులు సాయిబాబా దర్శనార్థం ఇక్కడకు వస్తుంటారు. భక్తుల సౌలభ్యం కోసం సాయిబాబా సంస్థానం భక్త నివాసం, విరాళాలు, దర్శన పాస్ వంటి సేవలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. అయితే, దీనినే అవకాశంగా తీసుకొని కొంత మంది మోసగాళ్లు భక్తులను మోసం చేస్తున్నారు. తాజాగా గుర్తు తెలియని ఓ వ్యక్తి సాయి సంస్థాన్ భక్తన్ నివాస్ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించాడు. ఆ నకిలీ వెబ్‌సైట్ ద్వారా ఓ ఫ్యామిలీ మోసం పోవడంతో ఈ విషయం వెలుగులో వచ్చింది. కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన రాము జాదవ్ అనే వ్యక్తి తన మనవడి పుట్టిన రోజు సందర్భంగా కుటుంబంతో కలిసి శిర్డీకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం రాము కుమారుడు గూగుల్‌లో శిర్డీ సాయిబాబా వెబ్‌సైట్ కోసం సెర్చ్ చేశాడు. అతడికి సాయి సంస్థాన్ భక్తన్ నివాస్ అనే పేరుతో ఓ వెబ్‌సైట్ కనిపించింది. అదే అధికారిక వెబ్‌సైట్ అనుకుని గది బుకింగ్ చేశాడు. తర్వాత నగదు కోసం వాట్సాప్‌లో ఓ స్కానర్‌ను పంపించారు. దాని నుంచి రూ.2100 చెల్లించాడు. రశీదును భక్తనివాస కౌంటర్ వద్ద ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత రాము కుటుంబ శిర్డీకు వెళ్లారు. అక్కడ భక్తనివాసానికి చేరుకున్న తర్వాత తమ పేరుతో ఎలాంటి బుకింగ్ కాలేదని చెప్పారు. దీంతో వాళ్లు మోసపోయినట్లు తెలుసుకున్నారు. సాయిబాబా సంస్థాన్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. నకిలీ వెబ్‌సైట్‌ల ద్వారా భక్తులను మోసం చేస్తున్నవారిపై శిర్డీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది అని సంస్థాన సీఈఓ గోరక్ష గడీల్కర్ తెలిపారు. సాయిబాబా సంస్థానం పేరుతో నకిలీ వెబ్‌సైట్‌లు తయారు చేసి, రూమ్ బుకింగ్, విరాళాలు, దర్శన పాస్ పేర్లతో అనేక మంది భక్తులను మోసం చేసినట్లు ఇంతకు ముందు కూడా కేసులు నమోదయ్యాయి.



## కాంగ్రెస్ శ్రేయస్సు కోసమే

- నా అభిప్రాయం బహిరంగంగా చెప్పా
- రూమర్స్ నమ్మొద్దు.. గుంటూరు వ్యక్తిగత కార్యక్రమం
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
- 70 వాహనాల కాన్వాయ్ తో ఏపీకీ రాజగోపాల్ రెడ్డి

**మునుగోడు, మహా:** రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పానని రాజ్ గోపాల్ రెడ్డి వివరించారు. అలా చెప్తే తప్పేంటి? ఇప్పుడు కూడా ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని రూమర్స్ పుట్టిస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే అన్నారు. ఆయన రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతానన్నారు. అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నానని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కాగా రాజగోపాల్ రెడ్డి 70కి పైగా వాహనాల కాన్వాయ్ తో ఏపీకి వెళ్ళడం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది.

## ప్రజా సమస్యలపై నిలదీయండి

శాసన మండలిలో వైసీపీకి మంచి బలం ఉంది

విద్య, వైద్యం, వ్యవసాయాన్ని పట్టించుకోవడం లేదు.. వైఎస్సార్ ఎల్పీ భేటీలో జగన్ కీలక వ్యాఖ్యలు

**తాడేపల్లి, మహా:** శాసన మండలిలో వైసీపీకి మంచి బలం ఉందని, ప్రజా సమస్యలపై మాట్లాడాలని వైసీపీ నేతలకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్ ఎల్పీ భేటీ జరిగింది. జగన్ అధ్యక్షతన జరిగిన వైసీపీ శాసనసభా పక్ష సమావేశానికి ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. శాసన మండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అంశాలపై జగన్ మార్గనిర్దేశం చేశారు. అసెంబ్లీలో ప్రజల గొంతు వినాలని ప్రభుత్వానికి లేదని, ఎవరూ గొంతు విప్పకూడదనేది వారి అభిప్రాయమని జగన్ విమర్శించారు.

**ప్రతిపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైసీపీ..**

కొంతమంది టీడీపీ వాళ్లను లాగేసి చంద్రబాబుకు ప్రతిపక్షం ఇవ్వకుండా చేయాలని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలామంది సలహాలు ఇచ్చారని.. కానీ, తాము అలా చేయలేదని జగన్ అన్నారు. ఇటీవలి ప్రెస్‌మీట్లో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ మోసాలు, మెడికల్ కాలేజీలు, యూరియా సహా రైతుల కష్టాల మీద మాట్లాడానని చెప్పారు. ఆ మూడింటి గురించి ఆధా



రాలతో సహా మాట్లాడటానికి గంటకుపైనే పట్టిందని, అసెంబ్లీలోనూ ఆ మాత్రం సమయం ఇస్తేనే నిశితంగా చెప్పగలుగుతామని అన్నారు. అసెంబ్లీలో ఉన్నవి నాలుగు పార్టీలే అని, అందులో బీజేపీ, జనసేన, టీడీపీ అధికార పక్షంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైసీపీ మాత్రమేనని చెప్పుకొచ్చారు. శాసన మండలిలో వైసీపీకి మంచి బలం ఉందని, అక్కడ ప్రజల తరపున గొంతు విప్పడానికి వైసీపీ నేతలకు అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అన్నది ఉందా? లేదా? అనే సందేహం ప్రజలకు కలుగుతోందని.. విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి కనీస అంశాలనూ పట్టించుకోవడం లేదని జగన్ విమర్శించారు. లా అండ్ ఆర్డర్ కూడా దారుణంగా ఉందని అభిప్రాయపడ్డారు.


# రైట్ లీడర్, రైట్ టైమ్..

## 2047లో ఫస్ట్ ప్లేస్‌లో భారత్

- జీఎస్టీ 2.0ను ఆమోదించిన తొలి రాష్ట్రంగా ఏపీ చరిత్ర
- భారీగా తగ్గనున్న నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు
- ప్రతిపక్ష హోదా అడుగుతున్న పార్టీ సంస్కరణలను స్వాగతించలేని దుస్థితి
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు
- అసెంబ్లీ 175 మంది ఎమ్మెల్యేల కోసం మాత్రమే కాదు.. 5 కోట్ల మంది ప్రజల కోసమని కామెంట్

**అమరావతి, మహా:** జీఎస్టీ 2.0 సంస్కరణలను స్వాగతిస్తూ ఏపీ అసెంబ్లీలో చేసిన తీర్మానంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడారు. దేశంలో తొలిసారిగా జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభ తీర్మానం చేసిందని తెలిపారు. జీఎస్టీ 2.0 కొత్త శ్లాబుల వల్ల జరిగే ప్రయోజనాల గురించి శాసనసభ ద్వారా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. తన రాజకీయ జీవితంలో మొదటిసారి ఇలాంటి జీఎస్టీ సవరణలు చూశానని చెప్పుకొచ్చారు. గతంలో డబ్బులు లేనప్పుడు ట్యాక్స్ వేసేవారని.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, టెక్నాలజీ, సవరణలను అమలు చేయడానికి తాను ముందు ఉంటానని ఉద్ఘాటించారు. ఎవరైతే సంపద సృష్టించలేరో వారికి సంక్షేమం ఇచ్చే అర్హత లేదని చమత్కరించారు. జీఎస్టీ స్లాబ్‌లలో మార్పు వస్తే ఇబ్బందులు వస్తాయని.. ఆదాయం తగ్గుతుందని ఆర్థిక శాఖ అధికారులు తనకు మొదట చెప్పారని గుర్తుచేశారు. అయితే వారితో దేశమే తొలి ప్రాధాన్యమని .. దాని తర్వాతే ఆదాయమని తాను చెప్పానని అన్నారు. ముందు ఏపీ నుంచి అధికారులు వెళ్లి జీఎస్టీ 2.0 సంస్కరణలకు మద్దతు ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు. ఐదు టైర్ల స్లాబ్‌ల నుంచి 2 స్లాబ్‌లకు జీఎస్టీని మార్చడం వల్ల 140 కోట్ల మందికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈసారి అన్ని పండుగలు ఘనంగా చేసుకునే అవకాశం వస్తుందని చెప్పుకొచ్చారు. గతంలో సంక్రాంతికి కానుక ఇచ్చామని... ఈరోజు జీఎస్టీ సవరణలతో 12 శాతంలో ఉన్న వారు సున్నా శాతం జీఎస్టీ కిందకు వచ్చేస్తారని తెలిపారు.


కొంతమందే ఇలాంటి జీఎస్టీ సవరణలు చేయగలుగుతారని, అలాంటి వారిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుంటారని ఉద్ఘాటించారు. 11 సంవత్సరాల్లో ప్రధాని మోదీ నిర్ణయాలు చూస్తే ట్యాక్స్ పేయర్స్ 130 శాతం మంది పెరిగారని వివరించారు. జీఎస్టీ బిల్లులు 207 శాతం పెరిగాయని, ఈరోజు రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం జీఎస్టీ ద్వారా వస్తోందని వెల్లడించారు. అన్ని రాష్ట్రప్రభుత్వాలకు జీఎస్టీ 2.0 సవరణలను వివరించిన తర్వాతనే ఆమోదించారని తెలిపారు. ఇంకా కొంచెం కష్టపడితే డబుల్ డిజిట్స్ సాధించే ఏకైక దేశం భారతదేశమే అవుతుందని నొక్కిచెప్పారు సీఎం చంద్రబాబు. జీఎస్టీ సవరణలు ఎలా ఉపయోగపడతాయో ప్రజలకు చెప్పాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. నిత్యావసరాల్లో చాలా వరకూ ప్రజలకు బెనిఫిట్ లభిస్తుందని తెలిపారు. కార్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లపై 28 నుంచి 18 శాతం జీఎస్టీ తగ్గుతుందని.. దీంతో మధ్యతరగతి వారు కూడా ఏసీలు వినియోగించడానికి ముందుకు వస్తారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొన్ని రాజకీయ పార్టీల వైఖరిని ఆయన తప్పుబట్టారు. "చరిత్రలో నిలిచిపోయే ఇలాంటి మంచి సంస్కరణలను కొన్ని పార్టీలు అర్థం చేసుకోలేవు, వాటికి సహకరించవు. కనీసం ప్రతిపక్ష హోదా అడుగుతున్న పార్టీ కూడా ఈ సంస్కరణలను స్వాగతించలేని దుస్థితిలో ఉండటం బాధాకరం" అని ఆయన విమర్శించారు. అసెంబ్లీ అనేది ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తును నిర్దేశించే దేవాలయమని, ప్రజా సమస్యలపై చర్చించి, ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావడానికి సభ్యులందరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు ఎక్కువ సమయం అసెంబ్లీలో గడపాలి. మంత్రులు, అధికారులు బాధ్యతగా శాసనసభలో ఉండాలి. అసెంబ్లీ 175 మంది ఎమ్మెల్యేల కోసం మాత్రమే కాదు... 5 కోట్ల మంది ప్రజల కోసం. వారి భవిష్యత్ కోసం అసెంబ్లీ ఏర్పాటైంది. అసెంబ్లీ అనే దేవాలయంలో ప్రజాహితం కోసం చేసే నిర్ణయాలు జరుగుతాయి. ప్రజల జీవితాల్లో మార్పుల కోసం మనం అంతా కూర్చుని చర్చించాలి. దేశాన్ని, భవిష్యత్ తరాన్ని ముందుకు నడిపించగలిగిన సంస్కరణ ఇది" అని చంద్రబాబు అన్నారు.



# జీఎస్టీ 2.0 పేదలకు వరం

## ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకం

- ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం జీఎస్టీ 2.0 చారిత్రాత్మకంగా నిలుస్తుంది
- రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా మద్దతు తెలిపింది ఏపీనే
- ఏపీ శాసనసభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**అమరావతి, మహా:** జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీర్మానం చేశారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. జీఎస్టీ మండలి 56వ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదించారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా ఈ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఏపీనే అని ఉద్ఘాటించారు. జీఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే విధానం మంచిదని.. దీనివల్ల దేశం స్థిరమైన వృద్ధి పెరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకని నొక్కిచెప్పారు. వ్యవసాయ పనిముట్లు, యంత్రాల రేట్లు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పాలు, పెరుగుపై పన్ను 5 శాతం నుంచి సున్నా శాతానికి అలాగే నిత్యావసరాల ధరలు చాలా వరకూ 18 నుంచి 5 శాతానికి తగ్గుతున్నాయని గుర్తుచేశారు.

**జీఎస్టీ పన్ను లేకుండా చేయడం ఎంతో మేలు..**

సిమెంట్‌పై పన్నును 28 నుంచి 18కి తగ్గించారని తెలిపారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగి వస్తువుల వాడకం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. జీఎస్టీ విషయంలో అన్ని వాణిజ్య, వ్యాపార సంఘాలు అంగీకారం తెలిపినందుకు ఏపీ ప్రభుత్వం తరపున ధన్యవాదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ఏఏ బెనిఫిట్స్ జీఎస్టీ సంస్కరణల ద్వారా అమలు అవుతాయో తెలియజేయాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు. పరస్పర అవగాహనతోపాటు మీడియా వేదిక ద్వారా ప్రజలకు లాభాల గురించి తెలియజేయాలని కోరారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# ఏపీలోని పలు ఆలయాలకు కొత్త ఛైర్మన్లు

## విజయవాడ, శ్రీశైలం, కాణిపాకంలకు పాలకవర్గం.. జూబ్లిహిల్స్ ఆలయ ఛైర్మన్ గా ఏవీరెడ్డి

**విజయవాడ, మహా :** ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఆలయాలకు కొత్త ఛైర్మన్లు వచ్చారు. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు కొత్త ఛైర్మన్లను నియమించిన చంద్రబాబు ప్రభుత్వం వారి పేర్లతో ఉత్తర్వులను విడుదల చేసింది. శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ, వాడపల్లితోపాటు ఇతర రాష్ట్రాల్లోని టీటీడీ ఆలయాలకు కూడా కొత్త ఛైర్మన్లను నియమిస్తున్నట్లు గురువారం తెలిపింది. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం ఛైర్మన్‌గా రమేష్ నాయుడుకు అవకాశం కల్పించారు. తూర్పు గోదావరి జిల్లాలో కోనసీమ తిరుపతిగా పేరు గాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా వెంకట్రాజును నియమించారు. చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఛైర్మన్‌గా సురేంద్రబాబు పేరును ఖరారు చేశారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్‌గా కొట్టె సాయిప్రసాద్‌ను నియమించారు. విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం ఛైర్మన్‌గా రాధాకృష్ణను నియమిస్తూ.. ఏపీ సర్కార్ ఉత్తర్వులు ఇచ్చింది.

**దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాలకు కొత్త ఛైర్మన్ల నియామకం**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా ఏవీ రెడ్డికి అవకాశం కల్పించారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా నేమూరి శంకర్ గౌడ్‌ను నియమించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉన్న టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా వీరాంజనేయులుకు అవకాశం ఇచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలోని టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా ఎదుగుండ్ల సుమంత్ రెడ్డిని నియమించారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్‌గా గౌతమ్ సింగానియాకు అవకాశం కల్పించారు.



# రైతులే స్వచ్ఛందంగా భూములిస్తున్నారు

## ఇండోసోల్ వివాదంపై మంత్రి అనగాని

**విజయవాడ, మహా :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ పరిశ్రమ కోసం రైతుల నుంచి ఎక్కడా బలవంతంగా భూములు లాక్కోబోమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం పెంచడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిశ్రమల కోసం భూములిస్తున్నారని చెప్పారు. భూ సేకరణపై శాసనమండలిలో వైకాపా సభ్యుడు తూమాటి మాధవరావు చేసిన పలు ఆరోపణలకు మంత్రి సమాధానమిచ్చారు. గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోగా.. కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి వస్తున్నాయన్నారు. రామాయపట్నం పోర్టు కట్టాలన్నది ప్రకాశం జిల్లా చిరకాల కోరికగా ఉందని, దీనికి అనుబంధంగా పారిశ్రామిక హబ్ నిర్మించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. రూ.43 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇండోసోల్ సంస్థ ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల 30 వేల మందికి ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. ఈ పరిశ్రమ కోసం మొత్తం 8214 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి స్పష్టం చేశారు.

# పింఛన్లు ఎక్కడా తొలగించలేదు

## రూ.3వేల నుంచి రూ.4వేలకు ఒకేసారి పెంచాం

### అనర్హులకు నోటీసులు ఇచ్చి రీ వెరిఫికేషన్ చేయాలన్నాం

### సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం

**అమరావతి, మహా:** అర్హులకు పింఛన్లు ఎక్కడా తొలగించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఎవరైనా చనిపోతే వెంటనే ఆ కుటుంబంలో మరొకరికి ఇస్తున్నామని చెప్పారు. అనర్హులకు మాత్రమే నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. పింఛను పథకంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 5059 ఏళ్ల మధ్య ఉన్న 11,98,501 మంది పింఛను పొందుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు ఇచ్చే పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు ఒకేసారి పెంచామన్నారు. అనర్హులకు నోటీసులు ఇచ్చి 2 నెలల్లో రీ వెరిఫికేషన్ చేయాలని వైద్యశాఖకు సూచించామని తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్లు ఇస్తోందన్నారు.





### జీరో అవర్‌ను మంత్రులు, అధికారులు

# సీరియస్‌గా తీసుకోవాలి

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, మహా :** జీరో అవర్‌లో సభ్యులు మాట్లాడితే మంత్రులు, అధికారులు నోట్ చేసుకోవడం లేదని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసహనం వ్యక్తం చేశారు. జీరో అవర్‌ను మంత్రులు, అధికారులు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి నాదెండ్ల మనోహర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అచ్చెన్నాయుడు వర్సెస్ బొత్స

## యూరియాపై హీటెక్కిన మండలి



**విజయవాడ, మహా :** యూరియా అంశంపై శాసన మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు , ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య వాదోపవాదాలు జరిగాయి. యూరియా సహా రైతు సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా సమస్యలపై చర్చకు వైకాపా సభ్యులు పట్టుబడుతూ తీర్మానం ఇచ్చారు. దీనిపై మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు స్పందిస్తూ.. వైకాపా తీర్మానాన్ని తిరస్కరించారు. మరో రోజు ఈ అంశంపై స్వల్పకాలిక చర్చ చేపడతామని సముదాయించారు. అయినా వైకాపా సభ్యులు శాంతించకపోవడంతో సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక కూడా వైకాపా సభ్యులు ఆందోళన కొనసాగించారు. యూరియా అంశంపై చర్చకు వాయిదాలు ఎందుకని బొత్స సత్యనారాయణ అన్నారు. గతంలో రైతులు రోడ్డెక్కిన సందర్భాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ సభలో ఏరోజు అజెండా ఆరోజు ఉందన్నారు. ప్రభుత్వం చర్చ నుంచి పారిపోవడం లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఏం చేసింది.. ఈ ప్రభుత్వం ఏం చేసిందనే విషయాలు ప్రజలు తెలియాలన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏ నిర్ణయాలు తీసుకుందనే విషయాలు వారికి చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని.. చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.
గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
అడ్మిషన్లు ప్రారంభమైనవి
అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 21
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 28
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
త్వరపడండి...
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్ కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
FOR ADMISSIONS CONTACT: +91 74369 39999
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

మహా పత్రిక
ANN తెలుగు
శుక్రవారం, హైదరాబాద్
19-09-2025

WWW.MAHAADAILY.COM

# సూపర్ రిచ్

## ఇండియాలో ఈ మహిళలే సంపన్నుల్లో టాప్

### వేల కోట్ల సంపదకు అధినేత్రులు

వారసత్వం నిలబెట్టి కొందరు.. సొంతగా నిర్మించి మరికొందరు

(మహా ప్రత్యేకం)

అతివలు.. ఎందులోనూ తీసిపోరు. భారత వ్యాపారరంగంలో మహిళలు దూసుకెళ్తున్నారు. వందలకోట్ల వ్యాపార సామ్రాజ్యాలు సృష్టిస్తూ ప్రత్యేకత సాధిస్తున్నారు. భారతదేశంలో అనేక మంది విజయవంతమైన మహిళావ్యాపారవేత్తలకు నిలయం. ఈ మహిళలు టెక్నాలజీ, అందం, ఫార్మాస్యూటికల్స్ స్టీల్ వంటి వివిధ పరిశ్రమల నుండి వచ్చారు. తమ కంపెనీలను అభివృద్ధి చేయడానికి, ఉద్యోగాలను సృష్టించడానికి మహిళలు కష్టపడి పనిచేశారు. కొందరు వ్యాపారాలను వారసత్వంగా పొంది వాటిని మరింత పెద్దదిగా చేశారు, మరికొందరు మొదటి నుండి ప్రారంభించి విజయభేరి మోగించారు. వ్యాపారంలోనూ మహిళలు మహారాణులే అని చాటారు. 2025లో టాప్ టెన్ లో ఉన్న భారతీయ మహిళా సంపన్నులు.. వారి విజయగాథ మహా పాఠకులకు ప్రత్యేకం.

### ఇండియాలో రిచెస్ట్ మహిళలు వీరే...

| ర్యాంకు | పేరు | సంపద(డాలర్లలో) | కంపెనీ |
|---|---|---|---|
| 1 | సావిత్రిజిందాల్ | 36.6 బిలియన్ | జిందాల్ గ్రూప్ |
| 2 | రేఖాజుంజున్ వాలా | 7.9బిలియన్ | టైటాన్ కంపెనీ |
| 3 | రేణుకా జగ్తియాని | 5.6 బిలియన్ | ల్యాండ్ మార్క్ |
| 4 | స్మిత క్రిష్ణ గోద్రెజ్ | 5.5బిలియన్ | గోద్రెజ్ |
| 5 | వినోద్ గుప్తా | 5.3 బిలియన్ | హవెల్స్ |
| 6 | లీనా తివారి | 3.9బిలియన్ | యుఎస్ ఫార్మా |
| 7 | ఫాల్గుణినాయర్ | 3.5 బిలియన్ | నైకా |
| 8 | రాధా వెంబు | 3.2 బిలియన్ | జోహో కార్పోరేషన్ |
| 9 | మహిమ దాట్ల | 3.3 బిలియన్ | బయలాజికల్ -ఈ |
| 10 | కిరణ్ మజుందార్ షా | 3.2 బిలియన్ | బయోకాన్ |

## 1. సావిత్రి జిందాల్

**వయసు: 75 సంవత్సరాలు.. నివాసం: హిసార్, హర్యానా**

భారతదేశంలోని అత్యంత ధనిక మహిళలలో *సావిత్రి జిందాల్* మొదటి స్థానంలో నిలుస్తున్నారు. ఆమె *ఓపి జిందాల్ గ్రూప్* చైర్‌పర్సన్ ఎమెరిటస్‌గా వ్యవహరిస్తున్నారు. 2005లో భర్త *ఓ.పి. జిందాల్* మరణం తరువాత ఈ సామ్రాజ్యాన్ని వారసత్వంగా స్వీకరించారు. ముఖ్యంగా, 2025లో భారతదేశ టాప్ 10 అత్యంత ధనవంతులలో సావిత్రి జిందాల్ మాత్రమే మహిళా బిలియనీర్‌గా నిలిచారు. వ్యాపారంతో పాటు ఆమె రాజకీయ రంగంలోకి కూడా అడుగుపెట్టారు. 2005లో హిసార్ నుంచి హర్యానా విధాన్ సభకు ఎన్నికై ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో మళ్లీ గెలిచి, 2013లో హర్యానా ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా నియమితులయ్యారు. 2024 అక్టోబరులో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి హిసార్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

## 2. రేఖా ఝున్‌జున్‌వాలా

స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్‌గా పేరుగాంచిన రేఖా ఝున్‌జున్‌వాలా, "బిగ్ బుల్"గా ప్రసిద్ధి చెందిన దివంగత రాకేష్ ఝున్‌జున్‌వాలా భార్య. ప్రస్తుతం భారతదేశంలోని మహిళా ధనవంతుల జాబితాలో రెండవ స్థానంలో ఉన్నారు. *ఫోర్బ్స్ 2025 తాజా డేటా* ప్రకారం, రేఖా ఝున్‌జున్‌వాలా యొక్క **మొత్తం నికర ఆస్తులు 7.9 బిలియన్లు. ఆమె తన భర్త నిర్మించిన ఇన్వెస్ట్‌మెంట్ వారసత్వాన్ని కొనసాగిస్తూ, స్టాక్ మార్కెట్‌లో కీలక ఇన్వెస్టర్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఆమె పోర్ట్‌ఫోలియోలో టైటాన్ కంపెనీ, స్టార్ హెల్త్ & అలైడ్ ఇన్సూరెన్స్, మెట్రో బ్రాండ్స్ వంటి ప్రధాన కంపెనీల్లో గణనీయమైన వాటాలు ఉన్నాయి. వీటితో పాటు అనేక మధ్యస్థాయి మరియు అభివృద్ధి చెందుతున్న కంపెనీలలో కూడా వాటాదారుగా ఉన్నారు. 2025 నాటికి, రేఖా ఝున్‌జున్‌వాలా భారత్‌లోని ప్రభావవంతమైన మహిళా ఇన్వెస్టర్లలో అగ్రగామిగా గుర్తింపు పొందుతున్నారు.

## 3. రేణుకా జగ్తియాని

**వయసు: 71 సంవత్సరాలు.. నివాసం: ముంబై, మహారాష్ట్ర**

**సంపద: 5.6 బిలియన్ డాలర్లు**

రేణుకా జగ్తియాని ల్యాండ్‌మార్క్ గ్రూప్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. దుబాయ్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన ఈ గ్లోబల్ కన్స్యూమర్ కంపెనీని ఆమె భర్త మిక్కీ జగ్తియాని 1973లో స్థాపించారు. రిటైల్ మరియు హాస్పిటాలిటీ రంగాల్లో ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా విశేష స్థాయిలో తన స్థానం సంపాదించుకుంది. ఇరవై దశాబ్దాల కంటే ఎక్కువ కాలంగా రేణుకా జగ్తియాని సంస్థ యొక్క *కార్పొరేట్ వ్యూహాత్మక దిశ*ను నిర్ణయించడంలో, కొత్త మార్కెట్లలో విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సంస్థ నాయకురాలిగా, 50,000 మందికి పైగా ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2024 డిసెంబర్ నాటికి, ఈ గ్రూప్ మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, భారత్, ఆగ్నేయాసియా దేశాలపైగా 17 దేశాల్లోతన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. అలాగే, 2024 నవంబరులో, వచ్చే మూడు సంవత్సరాల్లో 1 బిలియన్ అమెరికన్ డాలర్లు పెట్టుబడి పెట్టి జిసిసి (జీసీసీ), భారత్, ఆగ్నేయాసియాలో **400 కొత్త స్టోర్లను ప్రారంభించనున్నట్లు గ్రూప్ ప్రకటించింది.

# మహా రాణి

## దూసుకొచ్చిన మహిమ దాట్ల

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ధనిక మహిళలలో ఒకరు మహిమ దాట్ల. మహిమ దాట్ల బయలాజికల్ ఈ అనే ప్రైవేట్ ఇండియన్ బయోటెక్నాలజీ / వ్యాక్సిన్ తయారీ కంపెనీ యొక్క ఎండీ, సీఈవోగా ఉన్నారు. 2024లో ఫోర్బ్స్ రిచెస్ట్ మహిళల జాబితాలోకి తొలిసారి ఎంటరైన మహిమ దాట్ల 2025లో 9వ స్థానంలో నిలిచారు. 3.3బిలియన్ డాలర్ల నికర సంపద ఆమె పేరున ఉంది. హైదరాబాద్ నుండి అనేకమంది యువ పారిశ్రామికవేత్తలు వేగంగా దూసుకెళ్తున్నారు

## ఫల్గుణి నాయర్

ధనిక మహిళల జాబితాలో నైకా ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఫల్గుణి నాయర్. 3.5బిలియన్ డాలర్ల నికర సంపదతో ఉన్నారు. ఆమె దేశంలో ఎనిమిదో అత్యంత సంపన్న మహిళా వ్యాపారవేత్త. ఫల్గుణి నాయర్ కంపెనీ నైకా సౌందర్య ఉత్పత్తుల తయారీలో ప్రముఖ కంపెనీ. నైకాలో సగం వాటా ఫల్గుణి నాయర్‌కు ఉంది. మాజీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ ఫల్గుణి నాయర్ 2012లో ఈ కంపెనీని స్థాపించారు.

## రాధా వెంబు :


దేశంలోని ధనిక మహిళల్లో రాధా వెంబు కూడా ఉన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి పేరుంది. రాధ భారతదేశంలో ఎనిమిదో అత్యంత సంపన్న మహిళ. ఆమె మొత్తం నికర విలువ 3.3 బిలియన్ డాలర్లు. ఆమె కంపెనీ పేరు జోహో కార్పొరేషన్.

## కిరణ్ మజుందార్ షా:

భారతదేశంలోని టాప్10 సంపన్న మహిళల్లో కిరణ్ మజుందార్ షా పేరు పదో స్థానంలో ఉంది. ఫోర్బ్స్ ప్రకారం, ఆమె మొత్తం నికర విలువ 3.2 బిలియన్ డాలర్లు. కిరణ్ మజుందార్ షా ఫార్మా రంగ దిగ్గజం బయోకాన్ చైర్‌పర్సన్. కరోనా కాలంలో ఆమె కంపెనీ ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. విజయవంతమైన మహిళా వ్యాపారవేత్త.



# విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా-కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** మరాఠి విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జరిగిన విశ్వకర్మ జయంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విశ్వకర్మల ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయింపు విషయమై కలెక్టర్ కు సిఫారసు చేస్తానని తెలిపారు. ఆధునిక యంత్రాల వలన వండ్రంగి కుల వృత్తులు దూరమయ్యాయన్నారు. స్కిల్ డెవలప్మెంట్ విషయంలో తగిన ప్రాధాన్యత కల్పించే విషయంలో కృషి చేస్తానని తెలిపారు. అన్నిరంగాల్లో మరాఠి విశ్వకర్మలు అభివృద్ధి చెందాలన్నారు. కులస్తులలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానన్నారు.విశ్వకర్మలకు ఏ చిన్న కష్టమొచ్చినా తన అండగా ఉంటానని తెలిపారు. అనంతరం ఆలయ మఠాధిపతి యోగానంద సరస్వతి ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావు, కలాల శ్రీనివాస, సంజయ్ గుండావార్, మునిగేలా విట్టల్, లోక ప్రవీణ్ రెడ్డి, తమ్మల చందు, ఇందర్ వామన్, మినుకు నారాయణ రెడ్డి, మహేందర్,తిప్పిరెడ్డి విట్టల్ రెడ్డి, డేర్ కృష్ణా రెడ్డి, ఉమా మహేశ్వరి,గంగ మణి, రమ, విశ్వకర్మ మరాఠీ వడ్రంగి సంఘ అధ్యక్షుడు జాన్వె సంతోష్,ప్రధాన కార్యదర్శి దిలీప్, నాయకులు కయార్కర్ విలాస్, లాండె. విలాస్,గౌకార్ హన్మాండ్లు, గౌకార్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## సాగునీటి వివరాలు యాప్ లో
# నిక్షిప్తం చేయాలి
### మంచిర్యాల జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వి పూర్ణచంద్ర రావు

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలోని అన్ని సాగునీటి వనరుల వివరాలు యాప్ లో నిక్షిప్తం చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వి పూర్ణ చంద్ర రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లోని 7వ చిన్న తరహా నీటి వనరుల గణనలో భాగంగా మంచిర్యాలలోని 3 చెరువులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో వివరాలు, ఫోటోలను యాప్ లో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని సాగునీటి వనరుల వివరాలను యాప్ లో నమోదు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపగణాంక అధికారులు గురువయ్య, సురేష్ కుమార్, మండల సహాయ గణాంక అధికారులు హన్మోహన్, సురేందర్ లు పాల్గొన్నారని తెలిపారు.



## బాయిజమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ
# ఆసుపత్రిలో అన్న వితరణ

**బెల్లంపల్లి,మహా:** బాయిజమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు గార్లపల్లి జగదీశ్వర్ జ్ఞాపకార్థం కూతురు,అల్లుడు జీగురు మాలతి నాగయ్య సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్అ న్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్. కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని,గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది,సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ కి, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథిసత్కారంతో ఆదరిద్దాంఅన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య,శ్రవిద్య, త్రయాక్షర్ సూచించారు ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు,జేరిపోతుల చంద్రకళ సేవకులు పోతరాజుల తిరుపతి జి లావణ్య, జి రమాదేవి, ఎం కవిత, ఎన్ స్వరూప,పి ప్రశాంత్,యం రాఘవ, భీమన్న, దాతలు జీగురు మాలతి నాగయ్య పాల్గొన్నారు.

## సర్కారీ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం
# బిల్లులు ఇక ఆన్ లైన్ లోనే..
### మూడు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు విజయవంతం

**బెల్లంపల్లి, మహా:** సర్కారీ బడుల్లోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం మీల్స్ బిల్లులను ఇక ఆన్ లైన్ లోనే పంపించేలా మార్పులు చేస్తున్నారు.బిల్లుల చెల్లింపులోజాప్యాన్ని తగ్గించేందుకు విద్యాశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట, పెద్దపల్లి జిల్లాల్లో ఆన్లైన్ బిల్లుల అప్ లోడ్ విధానాన్ని పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించి ,విజయవంతంగా పూర్తి చేశారు.దీంతో రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచి అన్ని జిల్లాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని కార్యాచరణ ప్రారంభించిది. దీనికి అనుగుణంగా వెబ్ సైట్ లో మార్పులు చేస్తున్నారు. దీంట్లో ప్రతిరోజూ పిల్లలు వచ్చిన అంశాన్నీ అప్ లోడ్ చేయాల్సి ఉంది. ఏ రోజుకారోజు డేటా అధికారులకు చేరనుంది.మరోపక్క విద్యార్థులకు అందించే గుడ్లు, అరటిపండ్లు, రాగిజావ, బియ్యం తదితర డేటా అందుబాటులో రానున్నది.అయితే, ఇటీవల భారీగా నెలల తరబడి బిల్లులు పెండింగ్ లో ఉండటంతో, ఏజెన్సీ కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారు. వీటిని నిరోధించే చర్యల్లో భాగంగా ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రకటించారు.

## విదేశాల నుంచి వస్తున్న 3 ప్రయాణికుల వద్ద
# 4 కోట్లు విలువ చేసే బంగారం స్వాధీనం

**రాజేంద్రనగర్, మహా ;** విదేశాల నుంచి వస్తున్న ముగ్గురు ప్రయాణికుల లగేజ్ ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా 3.5 కేజీ, 4 కోట్లు విలువ చేసే బంగారన్ని, ఐరన్ బాక్స్ల కడ్డీలు, గొలుసులను డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో స్వాధీనం చేసుకున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ముగ్గురు నిందితులను కస్టమ్స్ చట్టం1962 ప్రకారం నిందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడికి తరలించారు.




# గుండెపోటుతో యువకుడు మృతి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో, జ్యూస్ తాగుతూ గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా, పల్లిపాడు గ్రామానికి చెందిన మేడ ఏకలవ్య (30), రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి సమయంలో రిలయన్స్ ట్రెండ్స్ ముందు జ్యూస్ పాయింట్ వద్ద జ్యూస్ తాగుతూ ఆకస్మాతుగా కిందపడిపోయాడు. కాగా అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**ఆమనగల్లు, మహా:** కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం కడ్తాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల తోట,ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్, కిచెన్ గార్డెన్,మొక్కల పెంపకం వంటి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వందేమాతరం మాధవ్ రెడ్డి హాజరై పాఠశాల ఆవరణంలో గల రావిచెట్టును తల్లి వృక్షంగా ప్రకటించి మాట్లాడారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పుడమి నాయకులను తయారు చేసే మహోత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, పచ్చని ప్రకృతి ఒడిలో స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటూ ఆనందంగా చదువుకునే భాగ్యం కేవలం సర్కారు బడి విద్యార్థులకు మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ,ఉపాధ్యాయులు రాధాకృష్ణ రెడ్డి,భీముడు, జనార్ధన్ రెడ్డి,శ్వేత,ఇంద్రారెడ్డి,కౌసల్య, గీత, స్రవంతి,బుచ్చమ్మ, సునీత,ఎర్త్ లీడర్స్ షష్మంత్, ముజాహిద్, ప్రసాద్, రాఘవేందర్ విద్యారులు మరియు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ రజనీకాంత్, వంశీ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిని లూటీ చేసి బంగారం నగదు
# ఎత్తుకెళ్లిన దొంగలు

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీపూరం కింగ్స్ కాలనీలో ఓ ఇంట్లో తాలాలు పగలగొట్టి బీర్వాలో ఉన్నా 47 తులాల బంగారం, 11 వేల నగదుతో పాటు ఖరీదైన విదేశీ వాచీలను దొంగలించిన సంఘటన మోలార్ దేవ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం ఇంటి యజమాని దుబాయ్ లో ఉండడంతో ఇంట్లో వాచ్మెన్ కుటుంబ సభ్యులతోపై అంతస్తులో నిద్ర పోతున్న సమయంలో, దొంగలు డోర్ ని బ్రేక్ చేసి 47 తులాల బంగారం 11 నగదును దోచుకెళ్లారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగల కోసం పలు పోలీసు బృందాలు కాలింపు చర్యలు చేపట్టాయి.

## బుర్కుంటా చెరువు ఎఫ్టిఎల్లో
# నిర్మాణాల కూల్చివేతలు

**రాజేంద్రనగర్ మహా ;** బుర్కుంటా చెరువు ఎఫ్టిఎల్లో అక్రమ నిర్మాణాలను హైడ్రాధికారులు గురువారం నేలమట్టం చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 56లో ఇరిగేషన్ రికార్డుల ప్రకారం 13 ఎకరాల్లో బుర్కుంటా చెరువు విస్తరించింది. చెరువు ఎఫ్టీఎల్లో అక్రమార్కులు 3000 గజాల్లో భారీ షెడ్ నిర్మాణంతోపాటు, కాంపౌండ్ వాల్ నిర్మించారు. హైడ్రాధికారి సీఐ తిరుమలేష్ ఆధ్వర్యంలో హైడ్రాస్ ఇబ్బంది పోలీసుల సాయంతో గురువారం 3000 గజాలో నిర్మాణం తలపెట్టిన భారీషెడ్ కాంపౌండ్ వాళ్ళుతో పాటు కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీ సభ్యులు ఆక్రమించిన రోడ్డును హై డ్రా అధికారులు జెసిబి సాయంతో నేలమట్టం చేశారు. చెరువులు, కుంటలు, నాళాలు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదు.

## ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్
# ప్రజలను మోసం చేసింది
### చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది

**మంచిర్యాల, మహా :** 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని చెన్నూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా భారత రాష్ట్రసమితి అధ్యక్షులు బాల్క సుమన్ విమర్శించారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు అప్పుడే బాగుండేది కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను అందజేసేందుకు ఆయన నాయకులు కార్యకర్తలతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో చేవెళ్లలో ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్, వరంగల్లో రైతు డిక్లరేషన్, కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్, సరూర్ నగర్ లో యూత్ డిక్లరేషన్ ఇచ్చి, నిరుద్యోగ యువతకు నెలకు 4000 రూపాయల భృతి కల్పిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాకుండా నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను ప్రస్తుత ఎమ్మెల్యే కొనసాగించడం లేదని ఆ విధంగా వ్యక్తం చేశారు. తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు చెన్నూరు నియోజకవర్గంలో 1 సెప్టెంబర్ నుంచి 15 రోజులపాటు "అప్పుడే బాగుండేది" అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అందులో భాగంగా వివిధ గ్రామాలకు పట్టణాలలో నెలకొన్న 40 వేల సమస్యలను తమ పార్టీ సేకరించినట్లు పేర్కొన్నారు. ఆ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కు ఇచ్చేందుకు తమ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ సిసి కి ఫిర్యాదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ రాజా రమేష్, బండారి సూరిబాబు, కొంగల తిరుపతిరెడ్డి, బత్తుల శ్రీనివాస్, ఎండి అబ్బాస్, బట్టు రాజ్ కుమార్, తోట సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



# టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

**రాజేంద్రనగర్ మహా ;** ఈనెల 26వ తేదీన కందుకూరులో జరిగే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మూడో మహాసభల గోడపత్రికను రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి ప్రకాష్ గౌడ్, మైలార్దేవ్పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్న గర్ డివిజన్ టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు అలమనేటి గోపాల్ , కార్యదర్శి ఇలిటం



బుచ్చన్న, డివిజన్ మాజీ అధ్యక్షులు కలాల్ సుదర్శన్ గౌడ్,సలహాదారు కోళ్ల యాదయ్య, ఎం శ్రీనివాస్, పి. శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పలు కాలనీలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు
### పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి సమీక్షించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి

**రాజేంద్రనగర్, మహా ;** రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సేవ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్ ఆధ్వర్యం లో మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ లో గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి చీపిర్లతో చెత్త ఎత్తి చెత్తను ఆటోలలో తరలించారు. క్లీన్ ఇండియాను సాధించాలన్న సత్సంకల్పంతో 2014 అక్టోబరు 2న భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బహిరంగ మలవిసర్జనను అరికట్టడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా 100 మిలియన్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించారు 6 లక్షలకు పైగా గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహితంగా మారాయి. కొనియాడారుసేవ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మనందరం కూడా నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను మైలార్దేవ్ పల్లి డివిజన్ లో స్వచ్ మైలార్ దేవ్ పల్లిగా తీర్చిదిద్దుకోలన్నారు. అందరూ తమ వంతు బాధ్యతగా కార్యకర్తలునాయకులు స్వచ్ఛతపై కాలనీ బస్తీలలో అవగాహన కల్పిస్తూ పరిసర ప్రాంతాలను



పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ లో జరుగుతున్న అభివృద్ధి పనులో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి త్వరగా తేవాలని అధికారులకు సూచించారు.

# పండుగకు ఊరికి వెళ్ళేవారికి పోలీస్ సూచనలు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాల ప్రజలకు దసరా పండగ సందర్భంగా ఆమనగల్లు సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో ముఖ్య సూచనలు విడుదల చేశారు. ఊరు వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారు ,వెండి,ఆభరణాలు , డబ్బులు ,బ్యాంక్ లాకర్ల లో భద్రపర్చుకోవాలని,లేనిచో మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవలన్నారు. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళము అమర్చుకునడం మంచిదన్నారు.. తాళము వేసి ఊరికి వెళ్లవల్సి వస్తే మీ యొక్క స్థానిక పోలీసు స్టేషన్ లో తప్పక సమాచారము ఇవ్వాలని తెలిపారు..మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వండి లేదా 100 నెంబర్ కు తప్పనిసరిగ ఫోన్ చేయాలని,మీ వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.మీ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయండి ,మీవాహనాలను ఇంటి ఆవరణ లోనే పార్కు చేసుకొండి . మీకు వీలైతే చక్రాలకు చైన్స్ తో కూడా లాక్ వెయ్యడం మంచిది. ఆన్లైన్ ద్వారా మీ ఇంట్లో అమర్చిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు చూసుకొంటూ వుండాలని, మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. మెన్ గెట్ / మెన్ డోర్ కి తాళం కప్ప వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్ తో కవర్ చేయడం , లేదా సెంట్రల్ లాక్ కలిగిన మెయిన్ డోర్ యొక్క తాళం కనిపించని విధంగా తగు జాగ్రతలు తీసుకోవలన్నారు.మీరు బయటకు వెళ్ళేటప్పుడు ఇంటి లోపల మరియు బయట కూడా లైట్లు వేసివుంటే మంచిదని మీ ఇంటి దగ్గర గల ఇరుగు పొరుగు వాళ్ళకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనించమని చెప్పడం మంచిదన్నారు. అల్మరా మరియు కప్ బోర్డ్స్ కు సంభందించిన తాళాలు రహస్య ప్రదేశంలో పెట్టుకోండి .నేరస్తులు నగదు , విలువైన ఆభరణాలు , బంగారం , వెండి , వాటికోసం అల్మారాలు , కప్ బోర్డులలో వెతుకుతారు కాబట్టి వాటిలో తాళాలు పెట్టకుండా వేరొక రహస్య ప్రదేశంలో పెట్టుకోవడం మంచిదన్నారు.మీరు ఊరికి వెళ్తున్నపుడు మీకు నమ్మకమైన వాళ్ళకు తప్ప వేరే వాళ్ళకు సమాచారం తెలియ కుండా జాగ్రత్తలు తీసుకోండి. సోషల్ మిడియాలో మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడము మంచిది కాదు .బతుకమ్మ సంబరాలు జరుపుకునేవారు నిమజ్జనం సమయంలో నీటి కుంటలు/చెరువులలో లోపలికి వెళ్ళకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని నిమజ్జనం చేయాలి.రావణ దహనం సమయంలో ప్రజలు సంయమనం పాటించి మంటకు నిర్ధేశించిన దూరంలో ఉండాలి. అలాగే జమ్మి పూజ సమయంలో కూడా జాగ్రత్తగా వ్యవహరించి పండుగ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని సూచించారు

# దేశంలో విద్యావంతులను తయారుచేసిన గొప్ప పాత్ర ఉపాధ్యాయులది
### ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్ధయ్య

**మంచిర్యాల, మహా :** దేశంలో విద్యావంతులను తయారుచేసిన గొప్ప పాత్ర ఉపాధ్యాయులదని మంచిర్యాల జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ భాస్కర్, ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య లు కీర్తించారు. మంచిర్యాల గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో బుధవారం రాత్రి ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖ ఆదికారులకు గురు బ్రహ్మ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారితో పాటు మంచిర్యాల జిల్లా డిస్టిక్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ సంతోష్ కుమార్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, కోట ఇనిస్టిట్యూట్ డి. అంజి రెడ్డి లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సంఘంలో



దాదాపు 150 పాఠశాలల సభ్యత్వం ఉండగా అందులో 120 పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయులుగా గురు బ్రహ్మ అవార్డు తో సన్మానించినట్లు వెల్లడించారు. గత 15 సంవత్సరాలుగా ట్రస్మా ప్రైవేటు ఉపాధ్యాయులకు విద్యా పురోగతి కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు రాష్ట్రంలో దేశంలో విద్యావంతులను తయారు చేసిన గొప్ప పాత్ర ఉపాధ్యాయులదని కొనియాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో లక్షల మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప వృత్తిలో ఉన్న ఉపాధ్యాయ లోకానికి తన వంతుగా సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు. ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ట్రస్మా చేస్తున్న కృషిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్ గౌడ్, ట్రస్మా రాష్ట్ర నాయకులు రాపోలు విష్ణువర్దన్ రావు, సురభి శరత్ కుమార్, యార్లగడ్డ బాలాజీ, రాం వేణు, అఖిలేందర్ సింగ్, బద్ధం పురుషోత్తం రెడ్డి, డేనియల్ రాజ్, జిల్లా గౌరవ అధ్యక్షురాలు గోనె భాగ్యలక్ష్మి, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు కొమ్ము దుర్గాప్రసాద్, వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## శరన్నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా
# నిర్వహించుకోవాలి
### నిర్వాహక కమిటీలతో ఎస్పీ అఖిల్


**ఆదిలాబాద్ మహా :** ఈనెల 22 నుండి ప్రారంభమవుతున్నభక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా దుర్గా , శారదా శరన్నవరాత్రులు నిర్వహించుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్అన్నారు. గురువారం పట్టణంలోని పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన మండపాల నిర్వాహకులు హిందూ సంఘాల ప్రతినిధుల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలో పూర్తిస్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలలో డీజేలకు అనుమతులు లేవన్నారు.మండప నిర్మాణంలో నాణ్యమైన వస్తువులను, కర్రలను, వైర్లను వినియోగించాలని సూచించారు.మండపాల వద్ద రాత్రి సమయాలలో నిర్వాహక కమిటీ సభ్యులు నిద్రించేలా చూసుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు నియమ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో డీజేలకు అనుమతులు ఉండవని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలను చేపట్టాలని సూచించారు. గణేష్ నవ రాత్రి ఉత్సవాలలో మాదిరిగా పటిష్టమైన పోలీసు బందోబస్తు సెక్టార్లవారిగా, క్లస్టర్ల వారిగా విభజించి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈవ్ టీజింగ్ జరగకుండా పట్టణంలోని మండపాల వద్ద షీ టీం పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అర్ధరాత్రి వరకు సౌండ్ బాక్సుల్లో పాటలు పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. ఈ శరన్నవరాత్రులు గతంలో మాదిరిగానే భక్తిశ్రద్ధలతో సాంప్రదాయాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.



# ఏఎన్ ఎన్ కథనానికి స్పందన
### పశువైద్య శిబిరం నిర్వహణ

**ఆదిలాబాద్ మహా :** ఏఎన్ ఎన్ కథనానికి స్పందన లభించింది. బేల మండలంలో పలు గ్రామాల్లో గత రెండు రోజుల నుండి లంపి స్కిన్ వ్యాధి రోజు రోజుకు వ్యాప్తి చెందుతుందని ఏఎన్ఎన్ వరుస కథనాలు ప్రసారం చేసింది. దీంతో పశువైద్య అధికారులు స్పందించి గురువారం మండలంలోని సిర్సన్న గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు లంపి చర్మవ్యాధి రోజు రోజుకు విజృంభిస్తున విషయం తన దృష్టికి వచ్చిందని మండల పశువైద్య అధికారి శ్రవణ్ కుమార్ అన్నారు.దీంతో వెంటనే సిర్సన్న గ్రామంలో వ్యాధిసోకిన పశువులకు టీకాలు వేయడం ప్రారంభించినట్టు చెప్పారు.మిగితా గ్రామాల్లో కూడా వారం రోజుల్లో వ్యాక్సిన్ పూర్తి చేస్తామని తెలిపారు. తమ సమస్య పరిష్కారం కోసం చొరవ చూపిన ఏఎన్ఎన్ ఛానల్ మహా పత్రికకు రైతులు పశువుల యజమానులు ధన్యవాదాలు తెలిపారు.

# ఒక్కసారే రీఛార్జ్.. ఏడాదంతా ఫ్రీ!



చాలామంది యూజర్లు మంత్లీ ప్లాన్స్ (28 రోజులు) రీఛార్జ్ చేసుకుంటారు. ఈ ప్యాక్ ధరలు, యాన్యువల్ ప్లాన్‌తో పోలిస్తే కొంత ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కొంతమంది ఏడాది ప్లాన్స్ రీఛార్జ్ చేసుకుంటున్నారు. ఈ కథనంలో బెస్ట్ యాన్యువల్ రీఛార్జ్ ప్లాన్స్ గురించి తెలుసుకుందాం.

**ఎయిర్‌టెల్**

ఎయిర్‌టెల్ తన యూజర్ల కోసం రూ.3599, రూ.2249 ప్లాన్స్ అందిస్తోంది. రూ.3599 రీఛార్జ్ చేసుకుంటే.. రోజుకు 2 జీబీ డేటా, అపరిమిత కాల్స్ వంటివాటితో పాటు.. ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ సబ్‌స్క్రిప్షన్ వంటివి లభిస్తాయి. కాగా రూ.2249 ప్లాన్ ద్వారా 365 రోజుల అపరిమిత కాలింగ్స్.. 30 జీబీ డేటా మాత్రమే లభిస్తుంది. ఇందులో డైలీ డేటా.. ఇతర సబ్‌స్క్రిప్షన్ ఉండవు.

**రిలయన్స్ జియో**

జియో యూజర్లకు రూ.3599, రూ.999, రూ.234, రూ.895 ప్లాన్స్ అందుబాటులో ఉన్నాయి. రూ. 3599 రీఛార్జ్ ప్లాన్ ద్వారా యూజర్లు అపరిమిత కాలింగ్స్ పొందటమే కాకుండా.. రోజుకి 2.5 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. పైగా జియో టీవీ, హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. రూ.3999 ప్లాన్ ద్వారా అదనంగా జియో ప్యాక్ కోడ్ సబ్‌స్క్రిప్షన్ పొందవచ్చు. అయితే రూ.1234 ద్వారా రీఛార్జ్ చేసుకుంటే.. 336 రోజుల వ్యాలిడిటీతో రోజుకి 0.5 జీబీ డేటా లభిస్తుంది. జియో ఫోన్ ప్రైమా యూజర్లు 336 రోజుల వాలిడిటీ కోసం రూ.895 రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ప్రతి 28 రోజులకు 2 జీబీ డేటా లభిస్తుంది.

**వోడాఫోన్ ఐడియా**

వోడాఫోన్ ఐడియా విషయానికి వస్తే.. ఇది తన యూజర్ల కోసం రూ. 3599తో రీఛార్జ్ ప్లాన్ అందిస్తుంది. దీని వ్యాలిడిటీ 365 రోజులు. రోజుకి 2జీబీ డేటా లభిస్తుంది. అపరిమిత వాయిస్ కాల్స్ పొందవచ్చు. అంతే కాకుండా ఈ ప్యాక్ రీఛార్జ్ చేసుకుంటే.. రాత్రి 12 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఫ్రీ డేటా పొందవచ్చు. రూ.3799తో రీఛార్జ్ చేస్తే.. అదనంగా ఆమెజ్జన్ ప్రైమ్ లైట్ సబ్‌స్క్రిప్షన్ కూడా లభిస్తుంది. రోజుకి 1.5 జీబీ చాలనుకుంటే.. రూ.3499తో రీఛార్జ్ చేసుకుంటే సరిపోతుంది. డైలీ డేటా వద్దనుకుంటే.. రూ.1999తో రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇందులో ప్యాక్ మొత్తానికి 24 జీబీ డేటా లభిస్తుంది.

**బీఎస్ఎన్ఎల్**

బీఎస్ఎన్ఎల్ విషయానికి.. రూ.2399, రూ.1999, రూ. 1515 అనే ప్లాన్స్ అందుబాటులో ఉన్నాయి. రూ.2399 ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. 600 రోజులు అపరిమిత కాల్స్, రోజుకి 2 జీబీ డేటా వంటివి లభిస్తాయి. రూ.1999 ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. 365 రోజులు 600 జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్ లభిస్తాయి. అయితే రూ.1515 ప్లాన్ ద్వారా 365 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత కాల్స్, రోజుకి 2 జీబీ డేటా లభిస్తుంది.

# ఈ స్కూటర్ల ఓనర్లకు గుడ్‌న్యూస్ చెప్పిన కంపెనీ



దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తమ కస్టమర్లకు మంచి కబురు చెప్పింది. దేశవ్యాప్తంగా 500 ఎక్స్ పీరియన్స్ సెంటర్ (ఈసీ)లను అధిగమించింది. ఇది దాని రిటైల్ విస్తరణలో ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది. గత మూడు నెలల్లో (జూన్‌ఆగస్టు 2025), ఏథర్ 101 కొత్త ఈసీలను జోడించింది. "మా వృద్ధి భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలిటీకి పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది" అని ఏథర్ ఎనర్జీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్నీత్ సింగ్ ఫోకెలా అన్నారు. "దక్షిణ భారతదేశం మా కంచుకోటగా నిలిచినప్పటికీ, రిజ్టా విజయం టైర్ 2, 3 నగరాల్లో మా విస్తరణను వేగవంతం చేసింది" అన్నారు. ఆగ్రా, జబల్పూర్, బిలాస్పూర్, వడోదర, సుందర్గఢ్ వంటి నగరాల్లో ఏథెర్ ఇప్పుడు ఈసీలను కలిగి ఉంది. అలాగే కాలికట్, గుంటూరు, హల్ద్వానీ, కోటా వంటి పట్టణాల్లోకి చొచ్చుకుపోయింది. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఒక్కో చోట 50కి పైగా ఈసీలు ఉన్నాయి. బెంగళూరులో ఏకంగా 18 కేంద్రాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఏథర్ మార్కెట్ వాటా 2026 తొలి త్రైమాసికంలో 14.3 శాతానికి పెరిగింది. గత సంవత్సరం ఇది 7.6% ఉండగా రెట్టింపు అయింది. మధ్య భారత దేశంలో వాటా 10.7 శాతానికి పెరిగగా, దక్షిణ భారతదేశంలో 22.8 శాతంతో ఆధిపత్యాన్ని చాటింది. ఏథర్ పోర్ట్ ఫోలియోలో పనితీరుఆధారిత 450 సిరీస్, ఫ్యామిలీఫోకస్డ్ రిజ్టా ఉన్నాయి. అథెర్ కమ్యూనిటీ డే 2025లో ఇది తన నెక్స్ట్ జెన్ ఈఎల్ ప్లాట్ ఫామ్, ఏథర్ స్టాక్ 7.0, ఇన్ఫినిట్ క్రూయిజ్, పోథోల్ అలర్ట్స్ వంటి కొత్త ఫీచర్లను ఆవిష్కరించింది. తమిళనాడులోని హోసూర్ లో ఏథర్ రెండు ప్లాంట్ లను నిర్వహిస్తోంది. మహారాష్ట్రలోని బిడ్కిన్ లో మూడవ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తోంది. ఇది మొత్తం సామర్థ్యాన్ని సంవత్సరానికి 1.42 మిలియన్ యూనిట్లకు పెంచుతుంది. భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత అందుబాటులోకి తీసుకురావడం ద్వారా 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఈసీలను 700లకు పైగా పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

# ఆ ఆరోపణలు తప్పు.. అదానీకి సెబీ క్లీన్ చిట్



**న్యూఢిల్లీ:** అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలకు సంబంధించి అదానీ గ్రూప్‌నకు, దాని చైర్మన్ గౌతమ్ అదానీకి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ క్లీన్ చిట్ ఇచ్చింది. ఇన్ సైడర్ ట్రేడింగ్, మార్కెట్ మానిప్యులేషన్, పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై వివరణాత్మక దర్యాప్తు తర్వాత అవి పూర్తిగా నిరాధారమైనవని సెబీ రెండు వేర్వేరు వివరణాత్మక ఉత్తర్వులలో తెలిపింది. హిండెన్ బర్గ్ 2023 జనవరిలో అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలతో ఒక నివేదికను వెల్లడించింది. అడికార్ప్ ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, మైల్ స్టోన్ ట్రేడ్ లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రెహ్వార్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను వాడుకుని పబ్లిక్ లిస్టెడ్ కంపెనీలైన అదానీ పవర్ లిమిటెడ్, అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ లకు నిధులు సమకూర్చడానికి వివిధ అదానీ గ్రూప్ కంపెనీల నుండి నిధులను మళ్లించారని ఆరోపించింది. అయితే అదానీ గ్రూపుపై ఈ అభియోగాలను సెబీ కొట్టేసింది. అదానీ గ్రూప్ ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని, ఎలాంటి అనైతిక కార్యకలాపాలకు పాల్పడలేదని స్పష్టం చేసింది. దీనిపై స్పందించిన గౌతమ్ అదానీ.. పడిన ప్రతిసారి మరింత గట్టిగా పైకి లేస్తామన్నారు. తమ సంస్థను నష్టపరిచేందుకు కొన్ని వర్గాల మీడియా స్వార్థ ప్రయోజనం కోసం ఆరోపణలు చేసిందని వెల్లడించారు.

# దుబాయ్ లాంటి దేశం.. చాలా తక్కువ ఖర్చుతో వీసా

దుబాయ్ అంటే చాలా మంది భారతీయ పర్యాటకులకు ఇష్టమైన గమ్యస్థానం. అయితే దుబాయ్ కు ప్రత్యామ్నాయంగా బహ్రెయిన్ దేశాన్ని చూస్తారు. ఇక్కడి వాతావరణం నిశ్శబ్దంగా, నిర్మలంగా ఉంటుంది. మనామాలో శతాబ్దాల నాటి కోటల పక్కన మెరిసే గాజు టవర్లను చూడవచ్చు. ఉదయం పూట సూక్ లో విక్రయించే ముత్యాలను బేరమాడి కొనుక్కోవచ్చు. మధ్యాహ్నం బీచ్ ఐలండ్‌లో సేద తీరవచ్చు. సూర్యాస్తమయం సమయంలో అరేబియన్ గల్ఫ్ మెరుపులను చూడవచ్చు. కుటుంబాలతో వచ్చినా, జంటగా వచ్చినా లేదా వ్యాపార పనుల మీద వచ్చినా ఇక్కడి అందాలను ఆస్వాదించవచ్చు.

### బహ్రెయిన్‌కు వీసా అవసరమా?


అవును.. బహ్రెయిన్ సందర్శనకు వీసా అవసరం. భారతీయ పాస్ పోర్ట్ హోల్డర్లు వీసా లేకుండా బహ్రెయిన్‌లోకి ప్రవేశించలేరు. వీసా పొందడానికి రెండు ప్రధాన మార్గాలు ఉన్నాయి. అవి ఒకటి ఈవీసా (ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి). మరొకటి వీసా ఆన్ అరైవల్ (అర్హత ఉన్నట్లయితే విమానాశ్రయం వద్ద పొందవచ్చు). రెండింటికీ చెల్లుబాటు అయ్యే పాస్ పోర్ట్, రిటర్న్ ఫ్లైట్ టికెట్, తగినంత నిధులు ఉండాలి. అయితే ఈ వీసాలపై అక్కడ పనిచేసుకోవడానికి మాత్రం అనుమతి ఉండదు.

### ఆన్ లైన్ వీసా ఫీజులు

2 వారాల సింగిల్ ఎంట్రీ — 10.000 బెహ్రెయినీ దినార్లు (రూ.2,336). 3 నెలల మల్టిపుల్ ఎంట్రీ — 17.000 బెహ్రెయినీ దినార్లు (రూ. 3,972). 1 సంవత్సరం మల్టిపుల్ ఎంట్రీ — 45.000 బెహ్రెయినీ దినార్లు (రూ. 10,515). 2 వారాల సింగిల్ ఎంట్రీ 5.000 బెహ్రెయినీ దినార్లు (రూ. 1,168). 3 నెలల మల్టిపుల్ ఎంట్రీ — 12.000 బెహ్రెయినీ దినార్లు (రూ. 2,804). బహ్రెయిన్ అధికారిక వీసా పోర్టల్ (జాతీయత, పాస్ పోర్ట్ లు, నివాస వ్యవహారాలు) లో అర్హతను సరిచూసుకోండి. ఆన్ లైన్ దరఖాస్తును పూరించి పత్రాలను అప్ లోడ్ చేయండి. తగిన రుసుము చెల్లించండి. ఆమోదం పొందాక కొన్ని రోజుల్లోనే ఈమెయిల్ ద్వారా అప్రూవల్ వస్తుంది. అన్ని పత్రాలతో బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోండి. వీసా కౌంటర్ వద్దకు వెళ్లి ఫీజు చెల్లించండి. వేలిముద్రలు లేదా ఫోటో వంటి బయోమెట్రిక్ తనిఖీలు చేయించుకోండి. కస్టమ్స్ క్లియర్ చేసి లగేజీని తీసుకోండి. చాలా ఈవీసాలు 3 నుండి 5 రోజుల్లో ప్రాసెస్ చేస్తారు. ఆన్‌అరైవల్ వీసాలు మాత్రం అదే రోజు మంజూరు చేస్తారు. బహ్రెయిన్ సందర్శించడానికి మంచి సమయం బహ్రెయిన్ ఎడారి దేశం కాబట్టి ఇక్కడ సమయం ముఖ్యమైనది. డిసెంబర్ నుండి మార్చి వరకు ఉత్తమ సీజన్. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. జూలై, ఆగస్టు నెలల్లో, ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు వెళ్లకపోవడం మంచిది. రంజాన్, ఈద్ వ్యాపార సమయాలు హోటల్ రేట్లు, రెస్టారెంట్ షెడ్యూల్ ను ప్రభావితం చేస్తాయి. కాబట్టి తదనుగుణంగా ప్లాన్ చేసుకోవడం ఉత్తమం.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL





# భారత్, మోదీతో మంచి స్నేహం

## ట్రేడ్ డీల్‌తోనే పాక్‌తో యుద్ధాన్ని ఆపా: ట్రంప్

**మహా :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని భారత్‌పై అక్కసు వెళ్లగ్గతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తాజాగా మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. అంతేకాకుండా ఆ దేశ ప్రధాని నరేంద్ర మోదీతో మంచి స్నేహం ఉందని తెలిపారు. మళ్లీ భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానంటూ పేర్కొన్నారు. బ్రిటన్ పర్యటనలో ట్రంప్, ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'నాకు భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రధాని మోదీ నాకు సన్నిహితుడు. ఇటీవలే ఆయనతో ఫోన్ మాట్లాడాను. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశా. మా ఇద్దరి మధ్య చాలా మంచి స్నేహం ఉంది. ఆయన కూడా ఓ అందమైన ప్రకటన చేశారు. వాటిని నేను చెప్పాను. కానీ దానిని ఆమోదించా. అయినప్పటికీ వాళ్లపై ఆంక్షలు విధించా. ప్రస్తుతం చైనా అమెరికాకు భారీ స్థాయిలో సుంకాలు చెల్లిస్తోంది. కానీ మరిన్ని వేయడానికి సిద్ధంగా ఉన్నా. చమురు కొనుగోలు ఆపివేస్తేనే రష్యా దిగివస్తుంది. మేం అదే చేయడానికే ప్రయత్నాలు చేస్తున్నాం' అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

# నా రోజువారి సంపాదన రూ.50

## వరద బాధితులతో కంగనా రనౌత్ ఆవేదన



**ధర్మస్థల:** నా రోజువారి ఆదాయం కేవలం రూ.50 మాత్రమే. కానీ నెలకు రూ.15 లక్షల జీతాలు చెల్లించాల్సి వస్తోంది. నా బాధను అర్థం చేసుకోండి," అంటూ బాలీవుడ్ క్వీన్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఆవేదన వ్యక్తం చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మాన్సూన్ సీజన్‌లో కుండపోత వర్షాలు, క్లౌడ్‌బరస్ట్‌లు హిమాచల్‌ను అతలాకుతలం చేశాయి. జూన్ 20 నుంచి ప్రారంభమైన వర్షాల కారణంగా ఇప్పటివరకు 419 మంది మరణించారు. వీరిలో 237 మంది వరదలు, కొండచరియలు, నీటి ప్రవాహం వల్ల ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల జరిగిన క్లౌడ్‌బరస్ట్ దాటికి రాష్ట్రం తీవ్రంగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో తన నియోజకవర్గమైన మండి జిల్లాలో పర్యటించిన కంగనా, వరద బాధితులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ ఏడాది ప్రారంభంలో మనాలీలో ప్రారంభించిన 'ది మౌంటెన్ స్టోరీ' రెస్టారెంట్ వరదల కారణంగా పర్యాటకులు తగ్గిపోవడంతో తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటోంది. 'నిన్న నా రెస్టారెంట్ ఆదాయం కేవలం రూ.50 మాత్రమే. కానీ నెలకు రూ.15 లక్షల జీతాలు చెల్లించాలి. నా బాధను అర్థం చేసుకోండి. నేనూ హిమాచలీనే' అని ఆమె అన్నారు. సోలాంగ్, పల్చన్ ప్రాంతాల్లో పర్యటించిన కంగనాకు స్థానికులు 15-16 ఇళ్లు ప్రమాదంలో ఉన్నాయని వివరించారు. బియాస్ నది కొండచరియలు విరిగిపడి గ్రామాలను ప్రమాదంలోకి నెట్టాయని చెప్పారు. అందుకే బియాస్ నది ప్రవాహాన్ని మళ్లించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు సూచించారు.

# బీజాపూర్ జిల్లా మంకేలి అడవుల్లో భీకర ఎన్‌కౌంటర్

## ఇప్పటి వరకు ఇద్దరు నక్సల్స్ మృతదేహాలు లభ్యం



బీజాపూర్ జిల్లా నైరుతి ప్రాంతంలోని మంకేలి అడవుల్లో భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు నక్సల్స్ మృతిచెందారు. వీరిపై రూ.7 లక్షల రివార్డు ఉంది. డీఆర్జీ, ఎస్టీఎఫ్, కోబ్రా 202, 205 బెటాలియన్ సంయుక్త బృందం ఈ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించినట్లు బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బలగాలు కూంబింగ్‌లో ఉండగా.. నక్సల్స్ తారసపడ్డారని, ఆ వెంటనే కాల్పులు జరిపారని పేర్కొన్నారు. ఆత్మ రక్షణ కోసం బలగాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించగా.. మరికొందరు అడవుల్లోకి పారిపోయినట్లు వివరించారు. వారికోసం కూంబింగ్ కొనసాగుతోందని తెలిపారు. మృతిచెందిన నక్సల్స్ వద్ద ఒక 303 రైఫిల్, ఒక బీజీఎల్ లాంచర్, మూడు బీజీఎల్, నాలుగు లైవ్ రౌండ్లు, బ్యాటరీ కార్డెక్స్ వైర్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# రాహుల్ ఆరోపణలపై ఈసీ రియాక్షన్..

## పటాకులే పేలాయంటూ సెటైర్లు



**న్యూఢిల్లీ:** ఓట్ల చోరీ పేరిట కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ చేసిన సంచలన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల స్పందించింది. ఆన్‌లైన్‌లో ఓట్లు ఎవరూ తొలగించలేరని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అదే సమయంలో మరోవైపు.. బీజేపీ సైతం ఆయన చేసిన ఆరోపణలపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారం.. అవాస్తవం. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటునూ తొలగించడం లేదు అని ఈసీ స్పష్టం చేసింది. అదే సమయంలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓట్ల తొలగింపు ప్రయత్నాలను మాత్రం అంగీకరించింది. '' ఆ సమయంలో కర్ణాటకలోని ఆలంద్ శాసనసభ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించేందుకు కొన్ని విఫలయత్నాలు జరిగాయి. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఎన్నికల సంఘం స్వయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరిపింది'' అని పేర్కొంది. మరోవైపు రాహుల్ గాంధీ చేసిన ఓట్ల దొంగతనం.. నకిలీ ఓట్ల చేర్పు ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఆయన బాంబు పేలలేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్‌ను బంగ్లాదేశ్, నేపాల్ లాంటి పరిస్థితుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నారు అని మండిపడ్డారు. ''ఎన్నికల నిర్వహణ కోసం ఈసీ నిష్పక్షపాతంగా పనిచేస్తోంది. కానీ రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ.. ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ సుమారు 90 ఎన్నికల్లో ఓడిపోయింది. ఆ వైరాగ్యంతోనే ఆయన అసత్య ఆరోపణలు చేస్తున్నారు అని ఠాకూర్ విమర్శించారు. హైడ్రోజన్ బాంబ్ పేలుస్తానన్న రాహుల్.. చివరికి పటాకులతోనే సరిపెట్టారు. ఆరోపణలే ఆయన రాజకీయ ఆభరణంగా మారాయి. కోర్టులు క్షమాపణలు కోరడం, మందలించడం ఆయనకు అలవాటైపోయింది అని అనురాగ్ ఠాకూర్ ఎద్దేవా చేశారు.

# అమెరికాలో పోలీసుల కాల్పులు..

## మహబూబ్‌నగర్ యువకుడి మృతి



అమెరికాలో మహబూబ్‌నగర్ యువకుడు మృతి చెందాడు. అయితే, తన కుమారుడు మొహమ్మద్ నిజాముద్దీన్‌ను పోలీసులు కాల్చి చంపారని.. పోలీసులు ఎందుకు కాల్చి చంపారో కారణాలు తెలియడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్‌కు మృతుడి తల్లిదండ్రులు లేఖ రాశారు. ఈ విషయంలో చొరవతీసుకుని వీలైనంత త్వరగా మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంలో సహకరించాలని కోరారు. మహబూబ్‌నగర్ రామయ్య బౌలికి చెందిన మొహమ్మద్ నిజాముద్దీన్.. డిసెంబర్ 2016లో మాస్టర్స్ డిగ్రీని అభ్యసించడానికి కాలిఫోర్నియాలోని శాంటా క్లారాకు వెళ్లాడు. ఆ యువకుడిని శాంటా క్లారా పోలీసులు కాల్చి చంపారు. మృతదేహం కాలిఫోర్నియాలోని శాంటా క్లారాలోని ఓ ఆసుపత్రిలో ఉందని తమకు తెలిసిందని.. తమ కుమారుడి మృతదేహాన్ని మహబూబ్ నగర్‌కు తీసుకురావడంలో సాయం చేయాలంటూ తల్లిదండ్రులు కోరుతున్నారు. వాషింగ్టన్ డీసీలోని భారత కాన్సులేట్ ద్వారా సంప్రదింపులు జరపాలని అభ్యర్థించారు.

# బాయ్ ఫ్రెండైనా ఉండాలి.. బ్యాగ్రౌండ్ ఐనా ఉండాలి



చలనచిత్ర రంగంలో తారలుగా రాణించాలని చాలా మందికి ఉంటుంది. అయితే అది అందరి వల్లా సాధ్యపడేది కాదు టాలెంట్ మాత్రమే ఉంటే చాలదు ఇంకా చాలా చాలా ఉండాలి. అలాంటి వాటిలో ఇటీవల బాగా చర్చనీయాంశం అవుతున్న విషయం సినీ పరిశ్రమలో అప్పటికే స్థిరపడిన కుటుంబాలు, వారికి సంబంధీకులకే తప్ప బయటివారికి అండా దండా లభించవనేది. అందువల్లే బయటివారికి సినిమా రంగంలో అంత త్వరగా అవకాశాలు రావని, ఏదోలా వచ్చినా సక్సెస్ అయినా కూడా స్థిరపడడం కష్టమేనని బయటి నుంచి ఆ రంగంలోకి వచ్చిన వారి ఆరోపణ. అలా ఆరోపిస్తున్నవారిలో తాజాగా సీనియర్ నటి అమీషా పటేల్ కూడా చేరింది. కహోనా ప్యార్ హై సినిమాలో హృతిక్ రోషన్ తో పాటు తెరంగేట్రం చేసిన ఈ నటి ఆ తర్వాత హిందీలో పలు సిని మాల్లో నటించింది. పవన్ కళ్యాణ్ సరసన బద్రి, నాని, నరసింహుడు, పరమవీర చక్ర..సినిమాలతో తెలుగు ప్రేక్షకులకూ దగ్గరైంది. ఆ తర్వాత అకస్మాత్తుగా సినిమాలకు దూరమైన అమీషా ఐదు సంవత్స రాల విరామం తర్వాత 2023లో సన్నీ డియోల్, ఉత్కర్ష్ శర్మతో కలిసి గదర్ 2 చిత్రంతో తిరిగి తెరపైకి వచ్చింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ దగ్గర రూ.686 కోట్లు వసూలు చేసి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత ఆమె చివరిగా 2024లో విడుదలైన తౌబా తేరా జల్వా చిత్రంలో కనిపించింది. ఈ చి త్రానికి విమర్శకుల నుంచి ప్రతికూల సమీక్షలు వచ్చాయి, కానీ అమీషా నటనకు మాత్రం ప్రశంసలు లభించాయి. ఆ తర్వాత మళ్లీ తన తదుపరి ప్రాజెక్ట్ గురించి అమీషా ఇంతవరకూ ప్రకటించలేదు.




# ఇక్కడ ఏదీ శాశ్వతం కాదు.. అర్థమైతే మంచింది

సామాజిక మాధ్యమాలను బాగా వాడుకునే నటీమణుల్లో సమంత ఒకరు. తమిళం, తెలుగు భాషల్లో నటించి అగ్ర కథా నాయకిగా ఏలిన ఈ అమ్మడు ఆ మధ్య మయోసైటీస్ అనే అరుదైన వ్యాధికి గురికావడంతో అది కెరీర్‌కు బాగా ఎఫెక్ట్ అయ్యింది. ఆ వ్యాధి నుంచి కోలుకున్నా, కథానాయకిగా మాత్రం బిజీ కాలేకపోతున్నారు. ఇటీవల నిర్మాతగా మారి శుభం అనే చిత్రాన్ని నిర్మించి అతిథి పాత్రలో నటించారు. ఆ చిత్రం మంచి పేరునే తెచ్చిపెట్టింది. అయినా తర్వాత చిత్రం గురించి ఎలాంటి ప్రకటన రాలేదు. అదేవిధంగా ఈమె మళ్లీ తమిళ చిత్రంలో హీరోయిన్‌గా నటించడానికి సిద్ధం అవుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. కానీ దాని గురించి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే సమంత మాత్రం ఏదో ఒక వార్తతో నిత్యం ప్రైమ్ టైమ్‌లో ఉండే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అలా తాజాగా సమస్యల కారణంగా తాను చాలా విషయాలను నేర్చుకున్నానని ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.అదేవిధంగా ఇక్కడ కథానాయకి కెరీర్‌గానీ, గ్లామర్, అభిమానులు, పాపులారిటీ ఏదీ శాశ్వతం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏదైనా కొంత కాలమేనని అన్నారు. ఒక నటిగా ఎదగడానికి చాలా అదృష్టానికి మించి చాలా కావాలన్నారు. తాను తన జీవితంలో నటిగా కంటే పెద్ద ప్రభావాన్ని చూపాలని కోరుకున్నానన్నారు. దాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం అని తెలిసిందన్నారు. ఇలా వేదాంతం పలుకుతున్న సమంత గురించి సామాజిక మాధ్యమాల్లో రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. అభిమానులు మాత్రం సమంతకు ఫుల్ సపోర్ట్‌గా నిలుస్తున్నారు. ఏదేమైనా సమంత మళ్లీ తెరపై ఎప్పుడు మెరుస్తుందో అని ఆమె అభిమానులు మాత్రం ఎదురు చూస్తున్నారు.

# సిడ్నీ స్వీనీ బాలీవుడ్ ఎంట్రీ..

## ఏకంగా రూ.530 కోట్ల డీల్!

సినీ ఇండస్ట్రీలో పారితోషికాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. స్టార్ హీరోలకైతే ఏకంగా వంద కోట్లు ముట్టజెప్పాల్సిందే. కొందరు బిగ్ స్టార్స్ ఏకంగా వంద కోట్లకు పైగానే రెమ్యునరేషన్ తీసుకునే వాళ్లు కూడా ఉన్నారు. అయితే హీరోయిన్ల విషయానికొస్తే పారితోషికాలు అంత ఎక్కువగా ఉండవు. హీరోకు ఇచ్చే రెమ్యునరేషన్‌లో పదిశాతం కూడా ఉండకపోవచ్చు. అలాంటిది ఒక హీరోయిన్‌కు వందల కోట్ల రూపాయలు ఆఫర్ చేస్తే ఎలా ఉంటుంది? అది మన బాలీవుడ్ సినిమాలో ఇంతలా భారీ రెమ్యునరేషన్ ఇచ్చేందుకు ఓ నిర్మాణ సంస్థ ముందుకొచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అని అనుకుంటున్నారా? అయితే ఈ స్టోరీ చదివేయండి. ప్రముఖ హాలీవుడ్ హీరోయిన్ సిడ్నీ స్వీనీ కోసం బాలీవుడ్ మేకర్స్ భారీ మొత్తంలో రెమ్యునరేషన్ ఇచ్చేందుకు రెడీ అయ్యారట. 'యుఫోరియా', 'ది వైట్ లోటస్' చిత్రాలతో ఫేమ్ తెచ్చుకున్న సిడ్నీ త్వరలోనే బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. ఓ బాలీవుడ్ చిత్రంలో నటించడానికి ఈ బిగ్ ఆఫర్ అందుకున్నట్లు సమాచారం. ఓ నివేదిక ప్రకారం 28 ఏళ్ల సిడ్నీ స్వీనికి ప్రముఖ నిర్మాణ సంస్థ దాదాపు రూ. 530 కోట్లకు పైగా పారితోషికం ఇచ్చేందుకు సంప్రదించిందని టాక్. ఒకవేళ ఆమె ఈ డీల్ అంగీకరిస్తే బాలీవుడ్ సినీ పరిశ్రమలోనే అత్యధిక పారితోషికం తీసుకున్న నటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్ట్ 2026 ప్రారంభంలో షూటింగ్ మొదలు కానున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీ షూటింగ్ న్యూయార్క్, పారిస్, లండన్, దుబాయ్ జరగనుందని సమాచారం. మొదట ఈ ఆఫర్ చూసి సిడ్నీ స్వీనీ ఆశ్చర్యపోయిందని ఓ నివేదికలో వెల్లడించింది. అయితే ఈ బిగ్ డీల్‌కు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సిడ్నీ తరపున ప్రతినిధులు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం సిడ్నీ స్వీనీ 'క్రిస్టీ' అనే మూవీలో నటిస్తోంది. ఈ చిత్రంలో యూఎస్ పోరాట యోధురాలు క్రిస్టీ మార్టిన్ పాత్రను పోషిస్తోంది. ఈ చిత్రం నవంబర్ 7న విడుదల కానుంది. ఆ తర్వాత సిడ్నీ నటించిన మరో చిత్రం 'ది హౌస్‌మెయిడ్' డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.





# ఆ ఒక్క కండీషనే దీపిక కొంప ముంచింది?

ఎంత పెద్ద స్టార్ అయినా హిట్ లేకపోతే ఇండస్ట్రీలో ఎక్కువ రోజులు ఉండలేరు. అందుకే సూపర్ స్టార్స్ సైతం ఫ్లాప్ వస్తే కాస్త భయపడతారు. తర్వాత సినిమా విషయంలో ఆచి తూచి అడుగేస్తారు. అల్రేడీ హిట్ ఇచ్చిన డైరెక్టర్స్‌ని ఎంచు కుంటారు. లేదా హిట్ అయిన సినిమాకు సీక్వెల్ తీస్తానంటే కళ్లుమూసుకొని పచ్చ జెండా ఊపుతారు. కానీ దీపికా పదుకొణె మాత్రం ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. అనవసరమైన కండీషన్లతో భారీ ప్రాజెక్టులను వదులుకుం టుంది. మొన్నటికి మొన్న ప్రభాస్ సందీప్‌రెడ్డి క్రేజీ కాంబో 'స్పిరిట్'ని మిస్ చేసుకుంది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రభంజనం సృష్టించిన 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి తప్పుకుంది. కాదు కాదు.. నిర్మాతలే ఆమెను తప్పించారు. ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేస్తూ వైజయంతీ మూవీస్ ట్వీట్ చేసింది. 'కల్కి 2898AD సినిమాకు రాబోయే సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని అధికారికంగా ప్రకటిస్తున్నాం. చాలా విషయాల్లో పరిశీలించిన తర్వాత తమ భాగస్వామ్యం నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నాం. పార్ట్ 1 సినిమా చేయడానికి చాలా దూరం ప్రయాణించినప్పటికీ, మా మధ్య భాగస్వామ్యం కుదరలేదు. కల్కి వంటి చిత్రానికి నిబద్ధత చాలా అవసరం. ఆమె భవిష్యత్‌లో మరెన్నో సినిమాలు చేయాలని మేము శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము' అని వైజయంతీ సంస్థ ఎక్స్‌లో పేర్కొంది.

### అసలు కారణం ఇదేనా?

దీపిక పెట్టిన కండీషన్లే తొలగింపుకు దారి తీశాయని అటు బాలీవుడ్‌తో పాటు ఇటు టాలీవుడ్‌లోనూ టాక్ నడుస్తోంది. రోజుకు 8 గంటల కంటే ఎక్కువ పని చేయలేనని దీపికా పదుకొణె కరాఖండిగా చెబుతోందట. అంతేకాదు రెమ్యునరేషన్ విషయంలోనూ తగ్గడం లేదట. ఇబ్బందికరమైన సీన్లను చేయలేనని చెబుతోందట. కల్కి సీక్వెల్ విషయంలోనూ దీపిక ఇలాంటి కండీషన్లే పెట్టిందట.

### ఆ ఒక్కటే నచ్చలేదు!

అయితే పారితోషికం విషయంలో వైజయంతీ సంస్థ వెనకడుగు అయితే వేయదు. కల్కి 2898 భారీ లాభాలను తెచ్చిపెట్టింది. అలాంది సినిమాకు సీక్వెల్ అంటే.. రెమ్యునరేషన్ విషయంలో మాత్రం నిర్మాణ సంస్థ పెద్దగా ఆలోచించదు. అడిగినంత ఇచ్చేందుకు రెడీగానే ఉందట. కానీ దీపిక పెట్టిన పని గంటల కండీషనే నచ్చలేదట. భారీ ప్రాజెక్ట్ విషయంలో పని గంటల కండీషన్ పని చేయదు. అందుకే నిర్మాతలు 'పూర్తి నిబద్ధత' అవసరం అని ప్రకటించారు. పెద్ద సినిమాల షూటింగ్ చెప్పిన సమయానికి పూర్తికాదు. నెలల తరబడి షూటింగ్ చేయాల్సి వస్తుంది. దీపిక పదుకొణె లాంటి స్టార్స్‌కి ఈ విషయం తెలుసు. అయినా కూడా తలకు మించిన కండీషన్లు పెట్టి.. సినిమాలను దూరం చేసుకుంటున్నారు. ఇలాంటి కండీషన్లు నచ్చకనే సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' నుంచి తప్పించాడు. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్ కూడా చేజారిపోయింది. దీపికా వైఖరి మారకపోతే.. మున్ముందు సినిమా చాన్స్‌లు రావడమే కష్టమవుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com